మన
నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284
www.manananationalistvoice.com epaper.manananationalistvoice.com

రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 127 | 03 శుక్రవారం, ఏప్రిల్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-
హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం

# అమరావతికి మా సంపూర్ణ మద్దతు

- కాళేశ్వరం ప్రాజెక్టుకు పైసా ఇవ్వకున్నా కట్టాం
- తెలంగాణకు 12 ఏళ్లుగా సాయం చేయని కేంద్రం
- రాజ్యసభలో వద్దిరాజు, కెఆర్ సురేశ్ రెడ్డి

**న్యూఢిల్లీ,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):** రాజధాని అమరావతికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు.

...మిగతా 2 లో...

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

- కెసిఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం
- ఏటిఎంలా ప్రాజెక్టు వాడుకున్న కెసిఆర్
- ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కెసిఆర్
- అవినీతిపై కెసిఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
- రాజ్యసభలో సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):** రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాలేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు.

...మిగతా 2 లో...

# కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

- పార్టీ శ్రేణులకు హరీష్ రావు పిలుపు



**సంగారెడ్డి,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):** కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గం బొల్లారంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ ఆరిఫ్ తో పాటు మరో 25 మంది సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరార. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.

...మిగతా 2 లో...




# తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు...

తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

...మిగతా 2 లో...

# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

- ప్రధాని మోడీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):** అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలి పాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్టీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు.

...మిగతా 2 లో...



# నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

- పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

02



# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికుల పై కక్ష

- అయిన వారి కోసం.. కార్మికుల పొట్ట కొడతారా?
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత

**హైదరాబాద్,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):** కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

...మిగతా 2 లో...



# భూభారతి పోర్టల్ ఆవిష్కరణ

- అక్రమాలకు ఇక చెక్ : పొంగులేటి

**రంగారెడ్డి,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):** రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పున రుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొం దించిన 'సమీకృత భూభారతి' పోర్ట ల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మం డలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్క రించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా ప్రభుత్వమిది అని అన్నా రు. ఈ నెలాఖరులో రెండో విడత ఇం దిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగు తుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.

## ఆ అధికారుల నిర్బంధం తెలియదు..

# పాలన నా చేతుల్లో లేదు



మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లా డుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలి యదని, ప్రస్తుతం పాలన తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు.అధికారుల నిర్బం ధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు.

...మిగతా 2 లో...

# రెండో చోట నామినేషన్

## వేసిన విజయ్.. తిరుచ్చిలో పొలిటికల్ హీట్



తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ తన ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. గురువారం ఆయన తిరుచ్చి తూర్పు నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన అభిమానులతో అక్కడ తీవ్ర కోలాహలం, కొంత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో ఒక ఊహించని సంఘటన చోటుచేసుకుంది.

...మిగతా 2 లో...



# నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

మొదటిపేజీ తరువాయి





**రంగారెడ్డి,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు. ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పక్రియను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కావచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు ఈ పక్రియ కొనసాగుతుందని.. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకే మేలు చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా రెండో విడతకు సంబంధించిన మార్గదర్శకాలు, ఎంపిక జాబితాపై అధికారులు కసరత్తు పూర్తి చేయనున్నారు..తమ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా, కోటి మంది మహిళలను 'కోటీశ్వరులుగా' తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఆవిష్కరించిన ఆయన.. ఇది ప్రజలకు భూమికి సంబంధించిన అన్ని హక్కులను భద్రపరుస్తుందని వివరించారు. భూమి రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే ఈ పోర్టల్ ప్రధాన ఉద్దేశం అన్నారు.

# రెండో చోట నామినేషన్

## వేసిన విజయ్.. తిరుచ్చిలో పొలిటికల్ హీట్

మొదటిపేజీ తరువాయి

విజయ్ కాన్వాయ్ నగరం గుండా వెళ్తుండగా, వందలాది మంది అభిమానులు పోలీసుల నియంత్రణను సైతం లెక్కచేయకుండా ఆయన వాహనాన్ని అనుసరించారు. ఈ తోపులాటలో కాన్వాయ్ పక్కన పరిగెడుతున్న ఓ మహిళ అదుపుతప్పి కిందపడిపోయారు. ఇది గమనించిన విజయ్ వెంటనే తన వాహనాన్ని ఆపి, కిందకు దిగి, గాయపడిన మహిళను వ్యక్తిగతంగా పరామర్శించారు. ఆమె క్షేమంగా ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాతే తన పర్యటనను కొనసాగించారు. ఈ సంఘటనతో అక్కడ కాసేపు ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది.అనంతరం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ముత్తు మురుగేశ పాండియన్‌కు విజయ్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పెరంబలూరులో ఆయన నామినేషన్ దాఖలు చేశారు.నామినేషన్ తర్వాత, విజయ్ దివంగత నేత ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఫల్యాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్ల కొరత ఉందని, అన్ని కుటుంబాలకు సరఫరా సరిగా అందుతోందా అని ప్రశ్నించారు. ఇతర విషయాల కోసం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సిలిండర్ల సమస్యను పరిష్కరించడానికి ఎందుకు వెళ్లలేదని నిలదీశారు.విలాత్తికులంలో పాఠశాల బాలిక హత్య ఘటనను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. ప్రజలు తమ భద్రతపై భయంతో బతుకుతున్నారని, రాష్ట్రంలో రాజకీయ మార్పు అత్యవసరమని అన్నారు. అధికారంలో ఉన్న 'దుష్ట శక్తులను' ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండు నియోజకవర్గాల్లో పోటీ, ప్రభుత్వాలపై సూటి విమర్శలతో విజయ్ తమిళనాడు ఎన్నికల బరిలో కొత్త వేడిని పుట్టించారు.

# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

మొదటిపేజీ తరువాయి

గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధప్రదేశ్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

# కాంగ్రెస్ మోసాలను

## సోషల్ మీడియాతో ఎండగట్టాలి

మొదటిపేజీ తరువాయి

.ప్రస్తుత రాజకీయాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలంటే సోషల్ మీడియాలో అత్యంత చురుకుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియానే నేడు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసింది. ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కి, అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ లేదు, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు. వారు చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అని తేలిపోయింది. యువతతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. అవ్వాతాతలకు పెన్షన్లు పెంచకుండా, కోటి మంది మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వకుండా, రైతన్నలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా ప్రతి వర్గాన్ని దారుణంగా మోసం చేసింది. ఈ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మీలాంటి యువత ముందుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి మోసాన్ని సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజలందరికీ తెలిసేలా చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యాక్రమంలో పటాన్‌చెరు పార్టీ ఇన్‌ఛార్జి ఆదర్శ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఆ అధికారుల నిర్బంధం తెలియదు..

## పాలన నా చేతుల్లో లేదు

మొదటిపేజీ తరువాయి

వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఈసీ చేతిలోకి వెళ్లాయని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)పై ప్రజలు చాలా కోపంగా ఉన్నారని మమతా బెనర్జీ అన్నారు. మాల్దాలో జరిగిన అధికారుల నిర్బంధం ఘటన బీజేపీ కుట్రలో భాగమని ఆమె ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ భావిస్తోందని అన్నారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపించారు. తనకు అర్ధరాత్రి సమయంలో ఒక జర్నలిస్టు ద్వారా నిర్బంధం విషయం తెలిసిందని వెల్లడించారు.

# 10మంది గంజాయి బ్యాచ్ అరెస్ట్

**కరీంనగర్,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):**

గంజాయి వినియోగంపై నార్కోటిక్స్ ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం బిగిస్తున్నారు. వరుస రైడ్లతో గంజాయి స్మగర్లకు నిద్రలేకుండా చేస్తున్న పోలీసులు.. గురువారం కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో స్పెషల్ రైడ్స్ నిర్వహించారు. ప్రాంతీయ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్స్, స్థానిక పోలీసులు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో 10 మంది గంజాయి వినియోగదారులు పట్టుబడ్డారు. నిందితులకు నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించారు.

# అమరావతికి మా సంపూర్ణ మద్దతు

మొదటిపేజీ తరువాయి

అమరావతి బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాలేశ్వరం అని అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు రుణాలతో కాలేశ్వరం కట్టామని వివరించారు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా కాలేశ్వరం నిర్మించామని చెప్పుకొచ్చారు. కాలేశ్వరంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చలేదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి మాట్లాడుతూ.. అమరావతికి గతంలోనే కేసీఆర్ మద్దతు తెలిపారన్నారు. అమరుల త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. దేశంలోనే తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలబెట్టామన్నారు. ప్రాంతాల వారీగా వేరైనా అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారని వెల్లడించారు. కనీసం చర్చ లేకుండా 7 మండలాలను ఏపీలో కలిపారని.. విభజన తీరుపై బీజేపీ తరచూ విమర్శలు చేస్తోందని అన్నారు. తల్లిని చంపి బిడ్డను తీశారన్నట్లు మాట్లాడారని సురేశ్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. కాలేశ్వరం అంటే ఒక డ్యాం.. ప్రాజెక్ట్ మాత్రమే కాదని ఎంపీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాలేశ్వరం అని తెలిపారు. పైసా ఇవ్వకపోయినా కాలేశ్వరం కట్టామన్నారు. అయినా కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ రూ.లక్ష కోట్లు పోయాయని మాట్లాడారని చెప్పారు. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని.. తెలంగాణ ప్రజలకు కేంద్ర మంత్రి పాటిల్ క్షమాపణ చెప్పాలని ఎంపీ సురేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో కూలిన రెండు పిల్లర్లను 300 కోట్లతో బాగు చేయవచ్చన్నారు. కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికుల పై కక్ష

మొదటిపేజీ తరువాయి

చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు.÷స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.

# సంపులో పడి చిన్నారి మృతి

**హైదరాబాద్,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):**

నార్సింగిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గండిపేటలో ఎనిమిది నెలల పసికందు సంపులో పడి మృతి చెందింది. ఆడుకుంటూ ఇంటి బయటికి వచ్చిన చిన్నారి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయింది. వెంటనే గమనించిన తల్లిదండ్రులు సంపు దగ్గరకు వెళ్లేలోపే నీటిలో మునిగిపోయింది. సంపులో నుంచి చిన్నారిని బయటకు తీసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీగా విలపించారు. పొట్ట చేత పట్టుకుని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు.. గండిపేటలో జీవనం సాగిస్తున్నారు. అప్పటి వరకు ఆడుకుంటున్న తమ చిన్నారి ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

# కాంగ్రెస్ నేత కాటా అరెస్ట్

## గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత

**సంగారెడ్డి,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):**

ఆర్‌సీ పురంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని.. తడి బట్టలతో గుడిలో ప్రమాణం చేస్తానని కాంగ్రెస్ నేత తెలిపారు. అందులో భాగంగా గురువారం ఉదయం బీరంగూడ శివాలయం వద్ద ప్రమాణం చేయడానికి వాహనంలో బయలుదేరారు కాటా శ్రీనివాస్. ఇంటి బయటే పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. శివాలయం వద్దకు వెళ్లే తీరుతానని కాటా శ్రీనివాస్ పట్టుబట్టారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన కుటుంబ సభ్యులను గుడికి అనుమతించాలని పోలీసులను శ్రీనివాస్ కోరారు. చివరకు కాటా శ్రీనివాస్ గౌడ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు హైదరాబాద్ వైపు తరలించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు, కాటా శ్రీనివాస్‌పై ఎమ్మెల్యే ప్రత్యారోపణలు చేయడంతో వార్ మొదలైంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తనపై చేసిన అవినీతి ఆరోపణలు నిజమైతే శివాలయంలో తడి బట్టలతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉన్నానని, గుడిలో తడి బట్టలతో ప్రమాణం చేస్తానని కాటా శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సవాల్‌పై ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంకా స్పందించలేదు.

# రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం...

## తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు...

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

మొదటిపేజీ తరువాయి



భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాలేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

# సంపాదకీయం

## జగన్.....చపలచిత్త రాజకీయాలు !

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శించాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతనుజోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతి ని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు. ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చ ఏయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్-బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్-బీ కింద మచిలీపట్నం (మా) -విజయవాడ (వి)-గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొచ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు. ఇష్టం వచ్చినట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్ట్రాలకు రాజదాని అసవరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజధాని అవుతుందనుకోవాలా అని ఆన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్రప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారుస్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతిరేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమానం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు. ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశపరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకు రావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవికృత రాజకీయ మేథను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్ట్రానికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

# ఓటమి ఎరుగని ధీరుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్.

## -నేడు ఆయన వర్ధంతి



ఓటమి ఎరుగని ధీరుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్. క్రీ.శ. ఫిబ్రవరి 19, 1630వ సంవత్సరం వైశాఖమాసపు శుక్లపక్ష తదియనాడు పూణే జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర గల శివనేరి కోటలో శహాజీ, జిజాబాయి పుణ్యదంపతులకు జన్మించాడు. వీరు మహారాష్ట్రలోని వ్యవసాయ కున్బీ కులానికి చెందినవారు. జిజాబాయికి శంభాజీ తర్వాత పుట్టిన కొడుకులు అందరూ మృతి చెందగా ఆమె పూజించే దేవత అయిన శివై (పార్వతి) పేరు శివాజీకు పెట్టింది.

శివాజీ తండ్రి షాహాజీ నిజాంషాహీల ప్రతినిధిగా పనిచేస్తూ మొఘల్ రాజులకు వ్యతిరేకంగా అనేక యుద్ధాల్లో పాల్గొన్నాడు. షాజహాన్ దండయాత్ర చేసిన సమయంలో కీలకపాత్ర పోషించాడు. తన సహచరుడిని నిజాంషాహీ ప్రభువు హత్యచేయించడంతో తిరుగుబాటు బావుటాను ఎగురవేసి స్వతంత్ర మరాఠా సామ్రాజ్య స్థాపనకు నాంది పలికాడు. రాజ్య విస్తరణ కోసం చేసిన యుద్ధాలలో పరాజయాన్ని చవిచూశాడు. తండ్రి వద్ద యుద్ధవిద్యలు, రాజనీతి మెలుకువలు నేర్చుకున్న శివాజీ తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనేక నూతన యుద్ధతంత్రాలను రూపొందించాడు. సకలవిద్యలను అవపోసన పట్టిన ఆయన మరాఠాసామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలను రచించాడు. 17 సంవత్సరాల వయస్సులోనే సూల్తానులలో యుద్ధాలకు తలపడిన శివాజీ బిజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడు. యుద్ధ భయంకరుడుగా పేరుపొందిన అఫ్జల్‌ఖాన్ శివాజీ మెరుపు దాడులు, గెరిల్లా యుద్ధ పద్దతులు తెలుసుకుని ఆయనను రెచ్చకొట్టేలా శివాజీకి ఇష్టదైవమైన భావానీదేవి ఆలయాన్ని కూల్చివేశాడు. అఫ్జల్ కుట్రలు తెలుసుకున్న శివాజీ ప్రతాప్‌ఘడ్ కోట లోసమావేశానికి అంగీకరిస్తాడు, ముందు జాగ్రత్తగా ఉక్కుకవచాన్ని ధరించి పిడిబాకును దాచుకుని చర్చలకు సిద్ధమవుతాడు.

శివాజీ ని అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకున్న అఫ్జల్ కత్తితో శివాజీపై దాడి చేస్తాడు, ఉక్కుకవచం కారణంగా రక్షించబడిన శివాజీ వెంటనే పిడిబాకులో దాడిచేస్తాడు, సైనికాధికారి చేతిలో అఫ్జల్ ఖాన్ మరణించగా మెరుపుదాడుల్లో సైనాన్ని మట్టికరిపిస్తాడు. ప్రతాప్ ఘడ్ యుద్ధంతో శివాజీ కీర్తిప్రతిష్టలు భారతదేశమంతటా వ్యాపిస్తాయి. ఎందరో హిందూ రాజులు ఆయన కు సంఘీభావం తెలియజేస్తారు. అఫ్జల్‌ఖాన్ మరణాన్ని సహించలేని బిజాపూర్ సుల్తాన్ పదివేలమంది అతిబలవంతులైన సైనికులను శివాజీని అంతమొందించడానికి పంపిస్తాడు. ఐదు వేలమంది మరాఠాయోధులతో హరహరమహా దేవ అంటూ విజృంభించిన శివాజీ వారిని ఊచకోతకోశాడు. శివాజీ పరాక్రమాలను తెలుసు కున్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ముందుజాగ్రత్తగా అపారమైన సైనికశక్తిని, సిద్ధి జోహార్ అనే సైనికాధ్యక్షుడిని కొల్హాపూర్‌లో మోహ రిస్తాడు. సమీపంలోని పన్‌హాలా కోటలో వందలమంది అనుచరులతో ఉన్న శివాజీ విషయం తెలుసుకుని కోటనుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు. ఈ యుద్ధంలో అతిఎక్కువమంది సైనికులను కోల్పోయిన శివాజీ సంధికి అంగీకరిస్తాడు. ఈ సంధిలో భాగంగా శివాజీ సామ్రాజ్యం స్వతంత్ర్య రాజ్యంగా గుర్తింపు, సిద్ధి జోహార్ విజయానికి బహుమతిగా పన్‌హాలా కోట దక్కింది. సుల్తానులతో శివాజీ చేసిన ఆఖరు పోరు పవన్ ఖండ్ యుద్ధం. శివాజీతో యుద్ధంలో ఎలాగైనా విజయం సాధించాలన్న లక్ష్యంతో ఔరంగజేబు తన మేనమామ షాయిస్తాఖాన్ వెంట లక్షకు పైగా సైన్యాన్ని, ఆయుధాలను ఇచ్చి దక్కన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశిస్తాడు. అయితే మొగల్‌సేనల ముందు మరాఠి సేనలు నిలువలేక పోతారు. ఓటమిని అంగీకరించిన శివాజీ పూణే వదిలి వెళ్లిపోతాడు. శివాజీ నిర్మించిన లాలామహల్ లో షాయిస్తాఖాన్ నివాసం ఏర్పాటుచేసుకుని, శివాజీ దాడి నుంచి ముందస్తుజాగ్రత్తగా పూణే నగరమంతా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాట్లు చేసుకుంటాడు. మారువేషంలో వచ్చిన శివాజీ షాయిస్తాఖాన్ గదిలోకి చేరి కత్తితో దాడి చేస్తాడు. గాయపడిన ఖాన్ సైనికుల సహాయంలో ప్రాణాలు దక్కించుని ఔరంగజేబు వద్దకు చేరుతాడు. తిరిగి తన కోటను స్వాధీనం చేసుకున్న శివాజీ సూరత్ నగరం పై దాడి చేసి అపారమైన ధనాన్ని, ఆయుధాలను దోచుకుని తన సైన్యాన్ని బలోపేతం చేసుకుని

క్రమంగా మొఘలుల, బీజాపూర్ సుల్తానుల కోటలను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుంటాడు. మొఘల్ సర్దార్‌గా ఉండడానికి అంగీకరించి 23కోటలను, నాలుగు లక్షల రూపాయలను చెల్లిస్తాడు. ఔరంగజేబు తన పుట్టినరోజు సందర్భంగా శివాజీని , అతని ఆరేళ్ల కొడుకు శంభాజీని ఆహ్వానించి నిండుసభలో అవమానపరుస్తాడు. మరాఠీల తిరుగుబాటుకు బయపడి శివాజీని హతమర్చకుండా అతిథిగృహంలోనే బందీచేస్తాడు. చాకచాక్యంతో అక్కడినుంచి తప్పించుకున్న శివాజీ రహస్యంగా తన కార్యకలాపాలు నిర్వహిస్తూ 1674 నాటికీ లక్షమంది సుశిక్షితులైన సైన్యాన్ని, ఆయుధాలను, అశ్వాలను, గుఢాచారి వ్యవస్థను, నౌకావ్యవస్థను ఏర్పాటుచేసుకుంటాడు. శ్రీశైలం వచ్చి అక్కడ భవానీదేవిని ధ్యానిస్తాడు. ఆయన భక్తికి మెచ్చిన దేవి ప్రత్యేక్షమై ఖడ్గాన్ని ప్రసాదిస్తుంది.(ఇప్పటికీ ఆ ఖడ్గం మ్యూజియంలో ఉంది.) మరాఠ సామ్రాజ్యాన్ని విస్తరించాలన్న ఆకాంక్ష, దేవి ఆశీస్సులు ఉన్న ఖడ్గంతో శివాజీ ఎన్నో కోటలను సులువుగా స్వాధీనం చేసుకున్నాడు. కొండ కోట ను స్వాధీనం చేసుకోవడానికి అత్యంత గొప్ప సైనికాధికారిగా పేరు తెచ్చుకున్న తానాజీని పురమాయిస్తాడు శివాజీ. కోట నిర్మాణాన్ని క్షుణ్ణంగా పరిశిలించిన తానాజీ యశ్వంతి అనే ఉడుముకు తాడు కట్టి కొండపైకి విసిరి, ఆ తాడు హాయంతో కోట లోకి ప్రవేశించి కోటను స్వాధీనం చేసుకుంటాడు. అయితే ఈ పోరులో తానాజీ మరణిస్తాడు. కోటను గెలిచాం కాని సింహాన్ని కోల్పోయామని ఆవేదన చెందిన శివాజీ ఆ కోటను సింహఘడ్ గా మార్చాడు.

మరాఠాసామ్రాజ్యాన్ని వ్యాపించచేసిన శివాజీకి రాయఘడ్ కోటలో వేదపఠనాల మధ్య క్షత్రియరాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ ఛత్రపతి బిరుదును ప్రదానం చేస్తారు. ఎన్నో కోటలపై దండయాత్రలు చేసిన శివాజీ ఏ మతానికి చెందిన పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదు. మొగలులకు, సుల్తాన్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆయన కొలువులో అనేకమంది ముస్లీంలు ఉండేవారు. సైన్యంలో మూడొంతులు ముస్లింలే. శివాజీకి సర్వసైన్యాధ్యక్షులుగా

దౌలత్‌ఖాన్, సిద్ధిక, నావికాదళానికి ఇబ్రహీం ఖాన్, మందుగుండు విభాగానికి అధ్యక్షుడుగా సిద్ది ఇబ్రహీం బాధ్యతలు నిర్వహించేవారు. పరస్త్రీలను మాతృ సమానురాలుగా చూసిన గొప్ప వ్యక్తి శివాజి. గెరిల్లా విధానంలో పోరాటం, కొత్త ఆయుధాలను కనుగొవడం శివాజీ అవలంభించిన యుద్ధవైటపుణఅయాలే. 27 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం అనేక యుద్ధాలు చేస్తూ మూడువందల కోటలను తన ఆధీనంలో ఉంచుకుని, లక్షమంది సైన్యాన్ని తయారు చేసిన శివాజీ కొండలపై సాంకేతిక విలువలతో శత్రుదుర్భేధ్యమైన కోటలను నిర్మించడంలో ప్రపంచఖ్యాతిని సొంతం చేసుకున్నాడు. నాసిక నుంచి మద్రాసు వరకు 1200 కిలోమీటర్ల మధ్య 300 కోటలు నిర్మించాడు. తన సామ్రాజ్యంలో అన్ని మతాల వారిని సమానంగా చూసిన ఆయన అనేక దేవాలయాలతో పాటు మసీదులను కూడా నిర్మించాడు. మతసామరస్యానికి ప్రతీకగా సాగిన శివాజీ పరిపాలన ను ఉదాహరించవచ్చు. ఏప్రిల్ 3, 1680న శివాజీ మరణం తరువాత ఆయన కుమారుడు శంభాజీ రాజ్యాపాలన బాధ్యతలు చేపట్టి తండ్రికి తగ్గ తనయుడిగా మొగల్‌లను ఎదుర్కొన్నారు. జనరంజకంగా పరిపాలన సాగించాడు.

# నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు భాసిన తొలి అమరుడు మన దొడ్డి కొమురయ్య

## -నేడు ఆయన జయంతి



నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి కొసం భూక్తి కొసం వెట్టిచాకిరి విముక్తి కొసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు భాసిన తొలి అమరుడు మన దొడ్డి కొమురయ్య. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. దీన్నే తెలంగాణ విమోచనోద్యమంగా పిలుస్తారు. తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర వినగానే మొదటగా గుర్తొచ్చేది తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు తొలి అమరుడు దొడ్డి కొమరయ్య. 03 ఏప్రిల్ 1927లో వరంగల్లు జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో సాధారణ గొర్రెల పెంపకందార్ల కుటుంబములో జన్మించాడు. ఇతని అన్న దొడ్డి మల్లయ్య కమ్యూనిస్టు పార్టీ గ్రామ నాయకుడు. విసునూర్ దేశ్‌ముఖ్ రామచంద్రా రెడ్డి తల్లి జానకమ్మా దొరసాని. ఆమె కడికవెండిలో వుండేది. ఈమె ప్రజల పట్ల అతి క్రూరంగా వ్యవహరించేది. మనషులను వెట్టిచాకిరి చేయించడంలో వడ్డీలు వసూలు చేయడంలో రకరకాల శిక్షలు, జరిమానాలు విధించడంలో పేరుగాంచింది. వెట్టి చాకిరికి దొపిడికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాట సేనాని ఆరుట్ల రాంచంద్రారెడ్డి, కడివెండి వెళ్లి ఆంధ్ర మహా సభ సందేశాన్ని ప్రజలకు వినిపించాడు. దీంతో గ్రామంలో సంఘమేర్పడింది. ఉత్సాహంగా యువతీ యువకులు ముందుకొచ్చారు. దిన దినంగా కడివెండిలో సంఘం బలంగా అయింది. వెట్టచాకిరిని నిర్మూలించారు. దొరలు, విసునూర్ ల ఆటలను అరికట్టించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిననూ నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని ఇక్కడి ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. దేశమంతటా స్వాతంత్ర్యోత్సవాలతో ప్రజలు ఆనందంతో గడుపుచుండగా నిజాం సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో కూరుకుపోయారు. 1946 జులై 2 న విసునూర్ నైజాం అల్లరి మూకలు రౌడీలతో 40 మంది వచ్చారు. ప్రజలంతా ఏకమై కర్రలు, బడిశెలు, గునపాలు అందుకుని విసునూర్, నిజాం, రజాకర్లను తరిమికొట్టారు. కడివెండి గ్రామంలో 1946 జులై 4న దేశ్‌ముఖ్ తొత్తులకు, రజాకార్లకు వ్యతిరేకంగా గుత్పల సంఘం తిరుగుబాటు లేవదీసింది. మల్లయ్య, కొమురయ్య నాయకత్వంలో ఆ తిరుగుబాటు ముందుకు సాగింది. మల్లయ్య, కొమురయ్యలను మట్టుబెడితే ఉద్యమం ఆపేయవచ్చునని జానకమ్మ దొరసాని ఆలోచించింది. దొరలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఊరేగింపుగా గడీ దగ్గరకు ర్యాలీ రాగానే రజాకార్లు, దొర బంట్లు గడీ లోపలి నుంచి జనంపైకి కాల్పులు జరిపారు. తొలుత దొడ్డి మల్లయ్య మోకాళ్లలో, మంగళి కొండయ్య నుదుట, దొడ్డి నర్సయ్య మోచేతి గుండా తూటాలు వెళ్లాయి. దొడ్డి కొమురయ్య పొట్టను చీల్చుకుంటూ తూటాలు పోవడంతో రక్తపు మడుగులో అతను నేలకొరిగాడు. కొమురయ్య రక్తంతో అక్కడి నేలంతా తడిచింది. నైజాం అల్లరి మూకలు, విసునూర్ తుపాకి తూటాలకు నేలరాలిన అరుణతారగా తెలంగాణ విప్లవంలో చెరగని ముద్రవేసుకున్నాడు దొడ్డి కొమురయ్య. మరణ వార్త జనగాం ప్రాంత ఆంధ్రమహాసభ కార్యకర్తలందరకీ విషాదకరమైన వార్తయింది. దేశ్‌ముఖ్, విసు నూర్ ఆగడాలన ఎదుర్కోవవడానికి పాలకుర్తి ప్రాంతం నుంచి యాదగిరిరావు, నిర్మల్ కృష్ణమూర్తి, నాయకత్వంలో ఆరు వేల మంది ప్రజాసైన్యం బయలుదేరింది. అప్పటి వరకూ శాంతియుతంగా సాగిన తెలంగాణ విముక్తి పోరు కాస్తా కొమురయ్య అమరత్వంతో రక్తానికి రక్తం.. ప్రాణానికి ప్రాణం.. అనే నినాదంతో సాయుధ పోరాటంగా మారింది. కొమురయ్య మరణంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం పోటెత్తడంతో దొరల గడీ నేలమట్టమైంది. కొమురయ్య త్యాగంతో మొదలైన పోరాటం హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఆంధ్ర మహాసభ కమ్యునిస్టు పార్టీగా అవతరించింది. ఎందరో నేతలు రైతులతో భుజంభుజం కలిపి తుపాకులు పట్టారు. దున్నే వాడిదే భూమి నినాదం మార్మోగింది. లక్షల ఎకరాల భూమి లేని పేదలకు పంచబడ్డాయి.

# అంజన్న ఆలయంలో ఆధ్యాత్మిక మహోత్సవం








**తూప్రాన్, ఏప్రిల్ 2.**

**నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

వీరాంజనేయ స్వామి ఆలయం గురువారం భక్తి, శ్రద్ధ, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా కళకళలాడింది.







మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై వెలసిన

హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ఉత్సవాలు

విశేషంగా భక్తులను ఆకట్టుకున్నాయి. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయి, గోవింద నామస్మరణలతో మారుమోగింది. వేలాది భక్తుల సమక్షంలో సామూహిక వ్రతాలు హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. సుమారు 250 మంది హనుమాన్ మాలధారణ స్వాములు, వందలాది మహిళలు, కుటుంబ సభ్యులతో కలిసి వ్రతాలలో పాల్గొన్నారు.వ్రత మండపం పూలతో అలంక రించబడగా, పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య వ్రత పూజలు ఘనంగా జరిగాయి. కుటుంబ సమేతంగా పాల్గొన్న భక్తులు తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించారు .40 ఏళ్లుగా కొన సాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయంఈ ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు గత నాలుగు దశాబ్దాలుగా నిరంతరంగా నిర్వహించ బడుతున్నాయి. స్థానికులు, భక్తులు కలిసి ఈ సంప్రదాయాన్ని గొప్పగా కొనసాగిస్తున్నారు. ఆధ్యాత్మిక వక్త ఆత్రేయ శర్మ మాట్లాడుతూ,

**"ఈ క్షేత్రం ఎంతో మహిమాన్వితమైనది"**

"ఇక్కడ భక్తితో ప్రార్థిస్తే కోరికలు తప్పకుండా నెరవేరుతాయి" అని పేర్కొన్నారు.తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొండగట్టు తరహాలో ఈ ఆలయం కూడా భక్తులకు విశేష విశ్వాసాన్ని కలిగిస్తోందని ఆయన తెలిపారు.చందనాభిషేకం -- లక్ష పూజలతో ఆధ్యాత్మిక కాంతి ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభ మయ్యాయి: ఆంజనేయ స్వామికి చందనాభిషేకం లక్ష ఆకుపూజ లక్ష పుష్పా ర్చన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఈ పూజలతో ఆలయ ప్రాంగణం పరమ పవిత్రంగా మారింది. భక్తులు క్రమపద్ధతిలో దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరి ంచారు. మాలధారణ -- మాల విరమణ ప్రత్యేకత హనుమాన్ జయంతి సందర్భంగా మాలధారణ చేసిన భక్తులు ఈ ఆలయంలో జయంతి రోజునే మాల విరమణ చేయడం ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగుతోంది. మాలధారణలో పాల్గొన్న భక్తులు నియమ నిష్ఠలతో జీవిస్తూ, జయంతి రోజు మాల విరమణ చేసి ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందడం విశేషం. మహా అన్నదానం -- భక్తులకు సేవే లక్ష్యం పూజల అనంతరం నిర్వహించిన మహా అన్నదానం కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అన్నదానంలో వడ్డించిన ప్రసాదం స్వీకరించిన భక్తులు నిర్వాహకులను అభినందించారు."అన్నదానం మహాదానం" అనే భావనతో ఈ కార్యక్రమం భక్తి భావాన్ని మరింత పెంచింది.

భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర హనుమాన్ జయంతి సందర్భంగా భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాషాయ జెండాలతో ఊరేగింపులు సంగీత వాయిద్యాలతో భక్తి గీతాలాపన నృత్యాలు ఆంజనేయ స్వామి వేషధారణలో యువత ఈ శోభాయాత్ర భక్తి ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసింది.ధర్మం -- నీతి మార్గం వైపు నడవాలిఈ సందర్భంగా ఆత్రేయ శర్మ భక్తులకు సందేశం ఇస్తూ:

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
ధర్మం, న్యాయం మార్గంలో నడవాలి
సనాతన సంప్ర దాయాలను కాపాడాలి


అని పిలుపునిచ్చారు.

వీరాంజనేయ స్వామి ఆశీస్సులతో సంతానం వివాహం ఉద్యోగం వ్యాపార అభివృద్ధి లాంటి కోరికలు నెరవేరుతాయని తెలిపారు.

ప్రముఖుల రాకతో మరింత శోభ ఈ కార్యక్రమంలో ధర్మకర్త శ్రీ సలాక కృష్ణమూర్తి శర్మ, సలాక రాజేశ్వర శర్మ లు పాల్గొని భక్తులకు ఆశీర్వచనం చేశారు. అలాగే మున్సిపల్ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు, సామాజిక ప్రముఖులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ సరస్వతి దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

భక్తి -- సంప్రదాయం -- సేవ కలిసిన మహాక్షేత్రం తూప్రాన్ పెద్ద చెరువు కట్టపై వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయం, హనుమాన్ జయంతి సందర్భంగా భక్తి ప్రవాహంగా మారి, వేలాది మంది భక్తుల హృదయాలను ఆకట్టుకుంది. ఈ ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలే కాకుండా, సంప్రదాయం సామూహికత సేవా భావం కలిసిన మహోత్సవంగా నిలిచాయి.

**జై శ్రీరామ్ -- జై వీరాంజనేయ స్వామి!**



# తాళ్లరాంపూర్ వార్నింగ్

## -నిబంధనలు అతిక్రమిస్తే -5000 జరిమానా ఖాయం!"

## -గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం..

**ఏప్రిల్ 02 ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్ :**

నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల పరిధిలోని తాళ్లరాంపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గురువారం సర్పంచ్ బెజ్జరపు పావని అధ్యక్షతన గ్రామ సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి, ప్రజా ఆరోగ్యం వంటి అంశాలపై చర్చించగా ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కీలక నిర్ణయం తీసు కున్నారు. గ్రామంలోని అన్ని దుకా ణాలు, హోటళ్లలో 18 సంవత్స రాలు నిండని పిల్లలకు సిగరెట్లు, గుట్కాలు వంటి మాదక పదార్థాలు అమ్మ కూడదని గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ నియమాన్ని ఉల్లంఘించిన దుకాణ దారులపై రూ. 5,000 జరిమానా విధించ బడుతుందని ప్రకటించారు.

అలాగే ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తూ విక్రయాలు చేస్తున్నట్లు గమనించి సమాచారం అందించిన వారికి రూ. 2,000 నగదు బహుమతి ఇవ్వబడుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాట్ల జనార్దన్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి భోజన్న,మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు. వారిలో డిపు రజిత, ఏర్గట్ల లక్ష్మి, తమ్మడి బాలహంస, రాంపల్లి లలిత, ఎనుగు నవీన్, బైండ్ల సునిత, బోదాసు గంగాధర్ తదితరులు హాజరయ్యారు.




# కోదాడలో బీజేపీ బలోపేతమే లక్ష్యం........

## కవితా రెడ్డి నియామకంతో బీజేపీలో నూతనోత్సాహం....

## సమన్వయంతో పార్టీని బలోపేతం చేస్తాం.....

## రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండారు కవితా రెడ్డి......

**నేషనలిస్ట్ వాయిస్: సూర్యాపేట జిల్లా...**

కోదాడ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండారు కవితా రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా కవితా రెడ్డిని అధిష్టానం నియమించిన సందర్భంగా కోదాడ నియోజకవర్గ బిజెపి పార్టీ నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులను అందరినీ కలుపుకొని పోయి సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాబోయే రోజుల్లో కోదాడలో కమలం జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మోడీ పాలనలో భారత్ ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా నిలుస్తోందని అన్నారు. తనకు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు రాం చందర్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సాతులూరి హనుమంతరావు, యరగని కళావతి, రాధాకృష్ణ, గోదేశీ లక్ష్మణ్, సతీష్, బసవయ్య, వీరబాబు, శంకర్ నాయక్, నాగేశ్వరరావు, రవికుమార్,శంకర్, సురేష్, జల్ల జనార్ధన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



# బట్టపూర్‌లో గ్రామసభ... అభివృద్ధిపై చర్చ

**ఏప్రిల్ 2 ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్ :**

ఏర్గట్ల మండలంలోని బట్టపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ ప్రవీణ్ యాదవ్ అధ్యక్షతన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థాయి అధికారులు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంకా అవసరమైన సౌకర్యాలపై వివరాలు చదివి వినిపించారు. ప్రత్యేక అధికారి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.గ్రామ సర్పంచ్ భూషణ వేణి ప్రవీణ్ యాదవ్, ఉప సర్పంచ్ మూడ్ దయానంద్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ప్రజాక్షేత్రంలో ఉండి వంద శాతం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సారంగి ముత్తెమ్మ, పోకల్కార్ గణేష్, మాలవత్ భీమానాయక్, మౌనిక, హేమలత, నీలిమ, అరవింద్, పంచాయతీ కార్యదర్శి ఆకుల రవి, జీపీఓ సంపత్, కారోబార్ కొండ శంకర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేణుగౌడ్, సభ్యులు మహిపాల్ రెడ్డి, చిన్న రెడ్డి, మూడ్ భీముడు నాయక్, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# తడపాకల్ గ్రామంలో గ్రామ సభ

**ఏప్రిల్ 02 ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్ :**

నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తడపాకల్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు స్థితిగతులపై అధికారులు, గ్రామస్తులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా విన్న సబ్ కలెక్టర్, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆపదలో రక్తదానంతో మహిళను ఆదుకున్న ఆసరా ఫౌండేషన్ సభ్యుడు

**కరీంనగర్ ఏప్రిల్ 02 (నేషనలిస్ట్ వాయిస్)**



కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ ఆపదలో మహిళను రక్తదానంతో ఆదుకున్నట్లు ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపి కృష్ణ తెలిపారు. కరీంనగర్ కు చెందిన మహిళ (67) స్థానిక రెని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండె ఆపరేషన్ నిమిత్తం ఆపదలో "ఓ" పాజిటివ్ రక్తం అవసరం కాగా ఆసరా ఫౌండేషన్ కోశాధికారి శ్రీరామోజు నిఖిల్ 27వ సారి రక్తదానంతో ఆదుకున్నాడు. ఈ సందర్భంగా రక్తదానంతో ప్రాణదాతగా నిలిచిన నిఖిల్ ను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, కే. ప్రవీణ్, జి. తిరుపతి, ఏం. రవి చందర్, ఎ. మహేందర్, బి. మహేష్ తదితరులు అభినందించారు.

# జై భీమ్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**కరీంనగర్ ఏప్రిల్ 02 (నేషనలిస్ట్ వాయిస్)**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కరీంనగర్ లోని అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్న భీమ్ యాత్ర పోస్టర్ ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏప్రిల్ మాసంలో మహనీయులైనటువంటి బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిభాపులే, బాబు జగ్జీవన్ రామ్ లాంటి మహానుభావులు జన్మించిన పవిత్ర మాసం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్ తదితరులున్నారు.





# అచీవర్స్ స్కూల్ లో ఘనంగా ప్రీ-ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుకలు





## విద్యార్థుల ప్రతిభకు మెడల్స్, సర్టిఫికెట్లు తల్లిదండ్రుల సమక్షంలో సందడి

**కరీంనగర్ ఏప్రిల్ 02(నేషనలిస్ట్ వాయిస్)**

స్థానిక కోతి రాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సి. హెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి. హెచ్. పల్లవి, ముఖ్య అతిథి వేణుగోపాల్ రెడ్డి సంయుక్తంగా దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, పద్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ప్రీ-ప్రైమరీ నుంచి ప్రాథమిక దశకు వెళ్తున్న విద్యార్థుల కోసం ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంపొందించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పల్లవి మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే విద్యపై దృష్టి సారించి లక్ష్యాలను ఏర్పరచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్య అతిథి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో జిజ్ఞాస, పోటీ తత్వం పెంచుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకలు

## ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ

## అధికారులకు ఘన సన్మానం

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 2.**





రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అడ్రియాల గని జమ్ కో కంపెనీ జనరల్ మేనేజర్ వల్లేటి నరసింహారావు ఆధ్వర్యంలో సుమారు 800 మందికి అన్నదానం ఏర్పాట్లు చేశారు. అడ్రియాల గని ఎస్ ఓ టు జి ఎం బండి సత్యనారాయణ, జంకో కంపెనీ మేనేజర్ వల్లేటి నరసింహారావు, ప్రాజెక్టు మేనేజర్ బల్ల శ్రీధర్, మేనేజర్ ఎస్పీ సింగ్, ఇంజనీర్ చైతన్య, విఠల్ కంపెనీ ప్రతినిధి బండారి శ్రీకాంత్ ను సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. వీరితోపాటు కల్వచెర్ల సర్పంచ్ రేండ్ల.శారద కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి, బూరుగు రాజు గౌడ్ పూజలో పాల్గొన్నారు. రత్నాపూర్ నుండి సెంటినరీ కాలనీ, రాంనగర్ మీదుగా రత్నాపూర్ వరకు ద్విచక్ర వాహనాలతో శోభాయాత్ర భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పూజారి సౌమిత్రి కృష్ణమాచార్యులు హనుమాన్ దేవాలయంలో హోమం తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ సభ్యులు అబ్బా స్రవంతి వెంకటేష్, జక్కుల పద్మ చందన్, కేక్కర్ల ఉషా అశోక్, బత్తిని ప్రశాంత్,అల్లి రమేష్, పున్నం మనితేజ, బత్తుల రాజమణి రమేష్, స్థానిక నాయకులు సందెవేన. కుమార్, కొండు అంజన్న, కొండు లక్ష్మణ్,పబ్బా మొగిలిలతో పాటు బొంగురాల రవి,కెక్కర్ల.మోహన్, కేశవన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళి

**కరీంనగర్ ఏప్రిల్ 02 (నేషనలిస్ట్ వాయిస్)**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం అధికారికంగా నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆ మహానీయుడికి ఘనంగా నివాళు లర్పించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన చూపిన ధైర్యసాహసాలు నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అధికారులు, గౌడ సంఘం నాయకులు, పలువురు సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహేశ్వర్ డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ కలెక్టరేట్ ఏవో సుధాకర్, పలువురు అధికారులు గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు ప్రమాద బాధితులకు అల్పాహారం అందజేత

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 02:**

మహారాష్ట్ర నుండి తెలంగాణ కు పనుల నిమిత్తం తుఫాన్ వాహనంలో వస్తుండగా బుధవారం రాత్రి మంథని మండల ఎక్లాస్పూర్ వద్ద తుఫాన్ వాహనం ప్రమాదవశాత్తు బొర్లపడింది. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు చిన్నచిన్న గాయాలు కాగా ఎలాంటి ప్రాణా నష్టం సంభవించలేదు. వారు తిరిగి వెళ్ళేందుకు ఇంకొక వాహనం మహారాష్ట్ర నుండి వస్తున్నందున వారు ఎగ్లాస్పూర్ చెక్ పోస్ట్ వద్ద సేద తీరగా మంత్రపురి చేయుత స్వచ్ఛంద సంస్థ వారు ఈ విషయం తెలుసుకొని గురువారం ఉదయం రోడ్డు ప్రమాద బాధితులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నన్నెగారి రాము , కొమురోజు మధుకర్ , కోటేష్ ,మంథని లింగయ్య మంథని లక్ష్మణ్ లు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి అడ్లూరి

## గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 02**

: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి పట్టణ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మపురి పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు మరణించగా, జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను గురువారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు యువకుల కుటుంబాలను మంత్రి పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఆదుకుంటామని మంత్రి తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి పోలీసులకు సూచించారు.ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని మంత్రి ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. మంత్రి వెంట జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తో పాటు ధర్మపురికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.





# పోతరవేని క్రాంతి ని సన్మానించిన మత్స్యశాఖ మంత్రి వాకిడి శ్రీహరి

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 02:**




ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ బోయిన్ పేట్ 6వార్డ్ నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా తన భార్య పోతరవేని శ్రీలతను భరీలో నిలిపి అన్ని తానై భారీ మెజారిటీతో గెలిపించిన మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతి కుమార్ ని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు,మత్స్యశాఖ మంత్రి వాకిడి శ్రీహరి ఘనంగా సత్కరించారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సచివాల యంలో శ్రీహరిని క్రాంతి మర్యాద పూర్వ కంగా కలువగా మంత్రి ఆయనకు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలియజేశారు.

# సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళులర్పించిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 02:**

సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మంథని మున్సిపల్ పరిధిలోని పాత పెట్రోల్ పంపు దగ్గర ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పుట్టమధుకర్ ఆదేశాల మేరకు మంథని మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేగోళపు శంకర్ గౌడ్ ,మంథని మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, నాయకుడు తగరం శంకర్ లాల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అరేపల్లి కుమార్,కాయితి సమ్మయ్య, వేల్పుల గట్టయ్య, పర్శవేన బక్కయ్య యాదవ్, పూదరి సాగర్ గౌడ్, పిల్లి సత్యనారాయణ, మాచిడి సత్యనారాయణ గౌడ్, కొత్త బాలయ్య ,ఇర్ఫాన్ , జావేద్, అమ్మకుట్టి మల్లేష్ లతోపాటు గౌడ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన యోధుడు సర్వాయి పాపన్న

## -కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 02:**

పీడిత ప్రజలకు రక్షకుడిగా నిలిచి దళిత, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని మొట్టమొదటిసారిగా నిరూపించిన యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు.

గురువారం రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.అనంతరం మండల అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్ లు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని చరిత్ర నిర్మాణంలో తనదైన చెరగని పాత్రను నిర్వర్తించిన ఒక మహాయోధుడు తెలంగాణ గడ్డపై జన్మించాడనీ అన్నారు.

దాదాపు 350 ఏండ్ల క్రితమే కుల, మత, జాతివర్గ విభేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన బహుజన పోరాట యోధుడు, గొప్ప సామాజిక బహుజనవిప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఆధిపత్య అగ్రకుల పాలకులు బహుజనులను అణగదొక్కుతున్న 17వ శతాబ్దంలో స్వీయ సైన్యంతో బహుజనుల సంక్షేమ బాధ్యత తీసుకొని బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడన్నారు, మహాత్మా జ్యోతిబా పూలే కంటే ముందే సామాజిక న్యాయం అమలు చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు.రాచరికపు వ్యవస్థ నీడలో అగ్రకులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జమీందార్లు, జాగీర్దారుల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరేళ్ల కిరణ్ గౌడ్, పర్శవేన మోహన్ యాదవ్, సాదుల శ్రీకాంత్, మంథని శ్రీనివాస్, అక్కపాక సది, శంకర్ గౌడ్, భీముని వెంకటస్వామి, ఎరుకల మధు, రాజిరెడ్డి లతో పాటు గౌడ కులస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# తొలగించిన స్విపింగ్ కార్మికులను వెంటనే ఆర్టీసీ యాజమాన్యం విధుల్లోకి తీసుకోవాలి

## -మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన సిఐటియు నాయకులు

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 02:**

ఆర్టీసీ స్వీపింగ్ కార్మికులను తొలగించడం చాలా అన్యాయమని,ఆర్టీసీ యాజమాన్యం తొలగించిన స్విపింగ్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

గురువారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పిఏ ఆకుల చంద్రశేఖర్ కు స్వీపింగ్ కార్మికులతో కలసి వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ మంథని పట్టణంలోని ముత్యాలమ్మ వాడకు చెందిన నిరుపేద దళిత మహిళలు గత 20 సంవత్సరాలుగా ఆర్టీసీ డిపో, బస్టాండ్ ప్రాంగణంలో స్లీపింగ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారని ఉద్యోగాల కుదింపు పేరుతో ఆర్టీసీ యాజమాన్యం కార్మికులను తొలగించడం చాలా అన్యాయమని అన్నారు. అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ పనిచేస్తున్న కార్మికులను తొలగించడం సరికాదని అన్నారు. దీంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని దిక్కు దోచని స్థితిలో నిరుపేద దళిత కార్మిక కుటుంబాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వెంటనే స్పందించి నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన మహిళ కార్మికులను విధుల్లోకి తీసుకొని యధావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏల్పుల సురేష్, కెవిపిఎస్ నాయకులు మంథని లింగయ్య, డివైఎఫ్ఐ నాయకులు గొర్రెంకల సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబు రవి ,స్వీపింగ్ కార్మికులు రాజమణి, రాజేశ్వరి, వెంకటమ్మ, శంకరమ్మ, రాజేశ్వరి, మమత, స్వరూప లు పాల్గొన్నారు.



# కన్నాల గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 02:**

మంథని మండలంలోని కన్నాల గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ గుడిసె గట్టయ్య ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. మంథని అభివృద్ధి ప్రదాత మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కృషితో కన్నాల గ్రామానికి 10 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులు మంజూరు కావడం జరిగిందని ఇట్టి నిధులతో కన్నాల, వేంపాడు గ్రామాలలో సిసి రోడ్డు నిర్మాణాలు ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ గట్టయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదె దివ్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ సెల్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ముసకుల ప్రశాంత్ రెడ్డి, మండల అధికార ప్రతినిధి తోకల మల్లేష్, వార్డు సభ్యులు కావటి రజిత, పర్శవేన అనిల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కావటి సందీప్ యాదవ్, ఉడుత పర్వతాల్ యాదవ్ లు పాల్గొన్నారు.



# సిలువపై ప్రేమ గెలిచిన రోజు

## -ప్రేమ శాంతికి నిదర్శనం క్రీస్తు బోధనలు

## -నేడు గుడ్ ఫ్రైడే

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 02:**

మానవాళి చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన, త్యాగపూరితమైన ఘట్టం గుడ్ ఫ్రైడే. ఇది కేవలం ఒక మరణం గురించిన కథ మాత్రమే కాదు, నిస్వార్థమైన ప్రేమకు, క్షమాగుణానికి నిదర్శనం. రెండు వేల ఏళ్ల క్రితం, యెరూషలేము వీధులు గందరగోళంతో నిండిపోయాయి. ఏ పాపమూ ఎరుగని యేసుక్రీస్తుపై నేరాలు మోపి, ఆయనకు సిలువ మరణాన్ని ఖరారు చేశారు.సిలువ మార్గం యేసు తన భుజాలపై బరువైన సిలువను మోస్తూ గొల్గొత్తా కొండ వైపు నడిచారు. ఆయన తలపై ముళ్ల కిరీటం పెట్టారు. సైనికులు ఆయనను కొరడాతో కొడుతూ, అవమానిస్తూ ఉన్నా ఆయన నోరు విప్పలేదు. దారి పొడవునా ప్రజలు ఆయనను చూస్తూ కన్నీరు పెట్టారు. కలువరి కొండపై క్షమాపణ మధ్యాహ్నం 12 గంటల సమయంలో, ఆయనను సిలువపై ఉంచి చేతులకు, కాళ్లకు మేకులు కొట్టారు. ఆ భయంకరమైన నొప్పిలో కూడా యేసుక్రీస్తు తనను హింసిస్తున్న వారిని చూసి ద్వేషించలేదు. దేవుని ప్రార్థిస్తూ ఇలా అన్నారు: "తండ్రీ, వీరు ఏమి చేయుచున్నారో వీరికి తెలియదు; వీరిని క్షమించుము." అపారమైన బాధలో ఉన్నప్పటికీ, తన పక్కనే సిలువ వేయబడిన ఒక దొంగ పశ్చాత్తాపం చెందగా, అతనికి పరలోక రాజ్యంలో చోటు ఉంటుందని వాగ్దానం చేశారు. ప్రకృతి స్పందన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో, అప్పటివరకు వెలుగుగా ఉన్న సూర్యుడు మరుగైపోయాడు. దేశమంతటా చీకటి కమ్మింది. యేసు బిగ్గరగా కేక వేసి, "సమస్తమును సంపూర్ణమైనది" అని పలికి తన ప్రాణాన్ని వదిలారు. ఆ క్షణమే దేవాలయంలోని తెర పైనుండి క్రిందికి రెండుగా చినిగిపోయింది, భూమి వణికింది.

**దీనిని 'గుడ్' ఫ్రైడే అని ఎందుకు అంటారు..?**

శిక్ష అనుభవించడం బాధాకరమైన విషయమే అయినా, దీనిని 'గుడ్' (శుభ) ఫ్రైడే అని పిలవడానికి కొన్ని ముఖ్య కారణాలు ఉన్నాయి:
ప్రేమ: దేవుడు లోకాన్ని ప్రేమించి, మనుషుల పాపాల కోసం తన కుమారుడిని బలిగా ఇచ్చాడని క్రైస్తవుల నమ్మకం.
విజయం: ఇది మరణంపై విజయానికి నాంది. పాపం, మరణం యొక్క సంకెళ్లను తెంచడానికి జరిగిన త్యాగం ఇది.
నిరీక్షణ: శుక్రవారం మరణం సంభవించినా, ఆదివారం ఆయన తిరిగి లేస్తారనే (ఈస్టర్) గొప్ప నిరీక్షణకు ఇది పునాది.

**ముగింపు**

గుడ్ ఫ్రైడే మనకు నేర్పే పాఠం ఒక్కటే: త్యాగం, క్షమాపణ. ఒకరిని ప్రేమించడం అంటే వారి కోసం మన స్వార్థాన్ని వదులుకోవడం అని యేసుక్రీస్తు తన సిలువ మరణం ద్వారా నిరూపించారు.మౌనంగా ప్రార్థన చేసుకుంటూ, ఆ గొప్ప త్యాగాన్ని స్మరించుకోవడమే ఈ రోజుకు మనం ఇచ్చే నిజమైన గౌరవం. మంథని నియోజకవర్గం లోని 177 చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు జరగనున్నాయి. క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో చర్చిలలో ప్రార్థనలు నిర్వహించనున్నారు ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానం చేస్తూ ఉపవాస ప్రార్థనలు నిర్వహించనున్నారు.

**ప్రేమ శాంతికి నిర్వచనం క్రీస్తు బోధనలు**

### గుడ్ ఫ్రైడే వేడుకలకు ముస్తాబైన మంథని సీయోను ప్రార్థన మందిరం




**-అంకరి కుమార్,**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్**

క్రీస్తు బోధనలు ప్రేమ శాంతికి నిర్వచనాలు. ప్రపంచ శాంతి కోసం ఆయన చేసిన త్యాగం మరువలేనిది. అవమానించిన, కొరడాతో కోడుతున్నా సత్యం వైపు ఆయన నిలబడ్డారు. ప్రపంచ శాంతి కోసం ఆయన తలపై ముళ్ళ కిరీటాన్ని ధరించారు. పాపులను రక్షించడానికి ఆయన చేసినటువంటి తన నెత్తురును చిందించారు. క్రీస్తు చూపిన దారిలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరు ప్రేమతో నడవాలి. గుడ్ ఫ్రైడే వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుగునున్నాయి. క్రైస్తవుల అభివృద్ధికి తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిధులు కేటాయించడం చాలా ఆనందకరమైన విషయం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి కృషి చేయడం హర్షనీయం



**అంకరి కుమార్,**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,**
**తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్**

# మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నేషనలిస్ట్ వాయిస్,మంచిర్యాల :**

మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 317వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.చంద్రయ్య జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి వివిధ శాఖల జిల్లా అధికారులు బి. సి. సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తురుష్ సైనికులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని రాజ్యాధికార సాధనపై ప్రజలలో చైతన్యం కలిగించారని బానిస ప్రజల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు. మహనీయుల చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా భావితరాలకు అందించవచ్చని ప్రభుత్వం మహనీయుల వర్ధంతి జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు బి సి సమాజ్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ఎన్. శ్రీనివాస్ బి. సి. సంఘాల ప్రతినిధి కె.లచ్చన్న గౌడ సంఘం రాష్ట్ర ప్రతినిధి ముఖేష్ గౌడ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ధర్మపురిలో ఘోర రోడ్డు ప్రమాదం

## ముగ్గురు వ్యక్తులు మృతి

## ఎనిమిది మందికి గాయాలు

**ధర్మపురి ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 02 :**

జగిత్యాల జిల్లాలోని ధర్మపురి పట్టణ ప్రాంతంలో ఉండే ఎన్ హెచ్ 63 ప్రధాన రహదారిపై భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జగిత్యాల నుండి ధర్మపురికి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ధర్మపురి వైపు నుండి జగిత్యాల వైపు వెళుతున్న లారీ ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందినట్లు, ఎనిమిది మంది గాయపడినట్లు ధర్మపురి ఎస్ఐ జి. మహేష్ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... ఎంహెచ్26 సిహెచ్ 5552 నెంబర్ గల సిమెంట్ లోడ్ లారీ ధర్మపురి నుండి జగిత్యాల వైపు వెళు తున్నదని, ఎపి15 బిఎస్ 8585 రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ పై జగిత్యాల వెళ్లి తిరిగి ధర్మపురికి వస్తున్నారని, ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులను అతివేగంగా ఎదురుగా వచ్చి లారీ ఢీకొనగా, ద్విచక్ర వాహనం పైన ఉన్న ముగ్గురు వ్యక్తులు ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారని ఎస్ఐ తెలిపారు. తర్వాత లారీ డ్రైవర్ లారీని అదే వేగంతో నిర్లక్ష్యంగా ఎడమ వైపు తిప్పగా లారీ యొక్క వెనుక భాగం పక్కన వెళ్తున్న ఆటోకు తగలగా ఆటోలో ఉన్న 8 మంది ఆంజనేయ స్వామి భక్తులకు కూడా గాయాలు అయ్యాయని ఎస్ఐ తెలిపారు. మృతిచెందిన బాలుర వివరాలు తెలుసుకొనగా ధర్మపురి కి చెందిన మాదాసు అమర్నాథ్ (18), అబ్బాపూర్ గ్రామానికి చెందిన పడాల రిశ్వంత్ (16), రేచపల్లి గ్రామానికి చెందిన కోల మయాంక్ (15) అని తెలిసిందని ఎస్ఐ తెలిపారు. మృతులు బుధవారం 10 గంటల సమయంలో తన స్నేహితుల వద్దకు పోయి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్ళినారని, తిరుగు ప్రయాణంలో లారీ ఢీకొని మృతి చెందారని ఎస్సై తెలిపారు. మృతులను వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని, లారీ డ్రైవర్ వివరాలు తెలుసుకొనగా మహారాష్ట్రకు చెందిన సయ్యద్ ఖాసిం బాసుమియా (42) అని తెలిసిందని, మృతులలో ఒకడైన మాదాసు అమర్నాథ్ తండ్రి అయిన మాదాసు లచ్చన్న ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు ధర్మపురి ఎస్సై మహేష్ తెలిపారు.

# ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకే గ్రామసభలు

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ గొప్ప కార్యక్రమం

### ఒకే రోజు జిల్లాలోని 268 గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం ప్రశంసనీయం

### వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

**వనపర్తి, గురువారం, 2 : (నేషనలిస్ట్ వాయిన్ )**

పేదలు బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రధాన అజెండాగా రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల మన్ననలు చూరగొంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా ఏదుల మండలం ఏదుల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు తెలంగాణ గీతాలాపన చేసి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అందించిన సందేశాన్ని చదివి గ్రామ ప్రజలకు వినిపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత రెండు న్నర ఏళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్ర మాలను ప్రజలకు చదివి వినిపించారు. గ్రామంలో అమలు చేసిన వివిధ ప్రభుత్వ పథకాలు వాటిని పొందిన లబ్ధిదారుల వివరాలను అధికారులు చదివి వినిపించారు. గ్రామంలో రైతు రుణమాఫీ పొందిన లబ్ధిదారులు, జరిగిన రుణమాఫీ మొత్తం, రైతు భరోసా, వరి ధాన్యం సేకరణ చెల్లించిన నగదు, మొత్తం రేషన్ కార్డులు, కొత్తగా మంజూరు చేసిన రేషన్ కార్డులు, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు, ఇంకా మంజూరు చేయాల్సి ఉన్న వివరాలు, స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన వడ్డీ లేని రుణాలు, చేయూత పెన్షన్ల లబ్ధిదారులు, ఉచిత చీరల పంపిణీ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించిన పనిదినాలు, మంజూరు అయిన వేతనం, చేపట్టిన పనులు, అంచనా విలువ తదితర అంశాలను లబ్ధిదారుల పేర్లతో సహా చదివి వినిపించారు. గ్రామంలో ఉన్న ప్రజల సమస్యలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల బాధ్యతల పై గ్రామ సభలో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ గొప్ప కార్యక్రమమని, ఒకే రోజు జిల్లాలోని 268 గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. గ్రామంలో ప్రజలకు జరిగిన మంచిని తెలియజేయడమే కాకుండా, ఇంకా గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి కార్య క్రమాలు ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాల విషయాలని గ్రామసభ ముందు ఉంచడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళా శక్తి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పెన్షన్, ఉచిత చీరల పంపిణీ వంటి కార్యక్రమాలతో ప్రజల మన్ననలను అందుకుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. దాంతో పాటుగా రైతులకు రూ. 21 వేల కోట్లతో రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించింది అన్నారు. ఇవే కాకుండా యంగిండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం అందించిం దన్నారు. ఏదుల గ్రామంలో 303 మంది రైతులకు గాను మొత్తం రూ.



2.77 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు గ్రామంలో మొత్తం 1351 రేషన్ కార్డులు ఉండగా కొత్తగా 192 రేషన్ కార్డులను జారీ చేసినట్లు తెలియజేశారు. పేద ప్రజలు కరెంటు బిల్లు భారాన్ని మోయకుండా ఇబ్బం దులను తొలగిస్తూ గృహ జ్యోతి పథకంతో 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించడం జరుగుతుందని తెలియజేశారు. గ్రామంలో 489 మంది లబ్ధిదారులు గృహజ్యోతి ఫలాలను పొందుతున్నట్లు తెలిపారు. త్వరలోనే కొత్తగా పెన్షన్లను కూడా ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. త్వరలోనే ఏదుల మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, గురుకుల పాఠశాల, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు కూడా అడుగులు ముందుకు పడేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఏదుల మండల కేంద్రంలో గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే నిధుల నుంచి నూతన బస్టాండును నిర్మించేందుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కలెక్టర్ ద్వారా పాఠశాల భవన నిర్మాణం కోసం కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరుగు తుందని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఈ రెండున్నర ఏళ్లలో ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు అందించింది, ఏ విధమైన అభివృద్ధి చేసింది అనే విషయాలను ప్రజలకు వివరించడమే కాకుండా, ఇంకా ప్రజలకు కావాల్సిన అవసరాలను తెలుసుకునేందుకే ఈ గ్రామసభలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ. 480 కోట్లతో రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అదేవిధంగా 1.75 లక్షల మంది రైతులకు రూ. 250 కోట్లతో రైతు భరోసా అందించడం జరిగిం దన్నారు. త్వరలోనే ప్రభుత్వం విద్యార్థుల ఆకలి తీర్చేందుకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా అమల్లోకి తీసుకురానన్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎదుల గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా ఏదుల మండలంలో రైతుల విజ్ఞప్తి మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఏదుల గ్రామం విషయానికి వస్తే గ్రామంలో 36 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. మొత్తం 450 మంది రైతుల నుంచి 2025-26 ఖరీఫ్ పంట కొనుగోలు చేసి రూ.6.19 లక్షలు రైతుల ఖాతాలో వేయడం జరిగిందన్నారు. 670 మంది మహిళలకు ఏకరూప చీరలను పంపిణీ చేయడం జరిగింది అన్నారు. 82 మహిళా స్వయం సహాయక సంఘాలకు 11.13 లక్షలు రూపాయల వడ్డీలేని రుణాలు చేయడం జరిగిందన్నారు. ఇంకా సంక్షేమ పథకాల లబ్ధి కావాల్సిన వారు గ్రామసభ హెల్ప్ డెస్క్ లో అర్జీ ఇవ్వాలని సూచించారు.

# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

## అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):**

ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠ శాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి అంతరా యం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.



# రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## రైతులకు మేలు జరిగే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

### ఇబ్రహీంపట్నంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి అడ్లూరి.

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 02 :**

మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మొక్కజొన్న కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ లో మార్క్ ఫెడ్ ద్వారా ఏర్పాటుచేసిన మొక్కల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి మంత్రి లక్ష్మణ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జగిత్యాల జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు చేశారని, ప్రస్తుతం బహిరంగ మార్కెట్ లో క్వింటాల్ మొక్కజొన్న రూపాయలు 1700 రూం.ల నుండి 1800 రూం.ల వరకు ధర పలుకుతుందని అన్నారు. కష్టపడి పండించిన మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి జగిత్యాల జిల్లాలో 15 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు మంత్రి తెలిపారు. మొదటిగా ఇబ్రహీంపట్నంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించామని రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర లభిస్తుందని జగిత్యాల జిల్లా రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లాలోని వివిధ హోదాలో ఉన్న ప్రజా ప్రతినిధులు రైతులకు మేలు జరిగే విధంగా పని చేయాలని మంత్రి సూచించారు. రబీ సీజన్లో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అధికారులు మిల్లర్లను సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని మంత్రి తెలిపారు. ధాన్యం విక్రయించిన ఐదు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డ్ లో రైతులకు ఇబ్బందులు లేకుండా సీసీ ప్లాట్ ఫాం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి జువ్వాడి నర్సింగ రావు, సివిల్ సప్లై, మార్కెటింగ్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు






## ప్రభుత్వ పాఠశాలలలో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

**ధర్మపురి ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 02 :**

రాష్ట్రంలో 24 నెలల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించే విధంగా ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మంత్రి అడ్లూరి గురువారం పాల్గొన్నారు.

**ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ...**

రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేరెళ్ల గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 134.90 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం అందించిందని మంత్రి తెలిపారు. రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, చేయూత పెన్షన్, కళ్యాణ లక్ష్మి, ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను ప్రభుత్వం అందజేసిందని మంత్రి వివరించారు. వీటితో పాటు కొత్తగా ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం టిఫిన్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని, కుటుంబ పెద్ద ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల పాలు కాకుండా ఇందిరమ్మ జీవిత ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా నేరెళ్ల గ్రామంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేస్తున్నామని మంత్రి తెలిపారు. పేద ప్రజలు తమ పిల్లలకు ప్రైవేటు విద్యను అందించలేని స్థితిలో ఉన్నారని, పేద ప్రజల విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించాలనేది ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని మంత్రి అడ్లూరి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం అనేక నిధులు కేటాయిస్తుందని గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ పాఠశాలలలో తమ పిల్లలను చేర్పించి నాణ్యమైన ఉచిత విద్యను పొందాలని మంత్రి పిలుపునిచ్చారు. నేరెళ్ల గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో తీసుకున్న నిర్ణయాలను ప్రణాళిక ప్రకారం అమలు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు

# పన్నూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాం.





## సర్పంచ్ చిందం మహేష్

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 2.**

రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీలో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ చిందం మహేష్ అధ్యక్షత జరిగింది, ముఖ్య అతిథులుగా మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనాథ్ , ఎంపీడీఓ శైలజా రాణి సైబర్ క్రైమ్ ఎస్ఐ రాంబాబు హాజరయ్యారు. ఈ సమావేశంలో రైతు భరోసా పథకం, సన్న రకం వడ్ల కొనుగోలు బోనస్ (రూ. 500), ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్), చేయూత పెన్షన్స్, గృహ జ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలుపై లబ్ధిదారుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. కొత్త పథకాలైన ఇందిరమ్మ కుటుంబ జీవన భీమా ద్వారా ఆర్థిక సహాయం, ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం మరియు మధ్యాహ్న భోజన పథకాలు అమలులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ లేకుండా ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కావేటి మల్లీశ్వరి , కార్యదర్శి హేమలత , వార్డు సభ్యులు మున్ని, స్వప్న, రమ, అరుణ, ప్రదీప్, ప్రశాంత్, కృష్ణ కుమార్, గ్రామ స్థాయి అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి దిశగా ఈ గ్రామ సభ విజయవంతంగా నిర్వహించబడింది.

# అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం

## కుట్రలు, కుతంత్రాలకు ఇక చెక్ పడినట్లే

### అమరావతి బిల్లుపై పవన్ హర్షం

**అమరావతి,ఏప్రిల్2(నేషనలిస్ట్ వాయిస్):**



ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నెళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి.. నేడు పార్లమెంట్ సాక్షిగా అమరావతి అజేయమైన శక్తిగా అవతరించిందని చెప్పారు. అమరావతి ఇక అజేయమని, అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. అమరావతి అభివృద్ధికి బలమైన తోడ్పాటు అందిస్తూ, చట్టబద్ధత బిల్లును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి ప్రత్యేక ధన్యవాదాలు'. ఈ చరిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పక్షాలు నిర్వహించే సంబరాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు, పార్టీ కార్యాలయాల వద్ద దీపాలు వెలిగించి అమరావతి విజయోత్సవాన్ని జరుపుకోవాలి' అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ అనంతరం రాజ్యసభలోనూ బిల్లు నెగ్గడంతో రాజధానిగా అమరావతికి ఇక ఎదురులేదని, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించ దగ్గ శుభపరిణామమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ అమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంలో ఉన్నారు. వారంతా ఎంతో గర్వించే క్షణాలు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది. లోక్‌సభలో ఈ బిల్లుకు మద్దతు తెలియజేసిన ఇతర పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు. అమరావతికి చట్టబద్ధత లభించడం జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్నవారికి రాబోయే రోజుల్లో ప్రజలు గొప్ప గుణపాఠం నేర్పిస్తారు.

# మంథని మున్సిపాలిటీలో వాడవాడలో వార్డు సభలు






## -రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపిన అధికారులు

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 02:**

ప్రజా పాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా గురు వారం మంథని మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారిగా వార్డు సభ కార్యక్రమాలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గేయాన్ని అలపించి, తొలుత ముఖ్య మంత్రి సందేశం చదివి వినిపించారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, మహలక్ష్మి, చేయూత, పథకాల గురించి వివరించారు. కొత్త పథకాలు, వార్డు సమస్యలను వార్డు ప్రజలతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమములో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ ఎన్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు కుర్ర లింగయ్య, నూకల కమల్, మాచిడి రాజు గౌడ్, మద్దికట్ల స్రవంతి, పోతరబోయిన శ్రీలత, జంబోజు శ్రీమతి, మారుపాక నిహారిక, వేముల లక్ష్మి, యేల్లంకి వంశీధర్ , మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్.పి లు, వైద్య సిబ్బంది, అంగన్ వాడి టీచర్స్, ప్రజలు పాల్గొన్నారు.

# మల్కాపూర్ లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం

**తూప్రాన్, ఏప్రిల్ 2. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో గురువారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ అధ్యక్షత వహించారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక సమస్యలు, అభివృద్ధి పనులపై గ్రామస్థులు సభలో చురుకుగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడం, ఫంక్షన్ హాల్ నిర్మాణం, భూముల రీ సర్వే, పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి అంశాలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో నిజమైన పేదలకు అన్యాయం జరుగుతోందని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిలో మల్కాపూర్ ఆదర్శ గ్రామం మరింత ముందుకు వెళ్లాలంటే గ్రామస్థులు, యువత పంచాయతీ పాలకవర్గానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మధుసూదన్, వీబీజీ రాంజీ, టెక్నికల్ అసిస్టెంట్ సత్యం, ఉప సర్పంచ్ స్వామి, జీపీఓ విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, సురేందర్ రావు, పాలకవర్గ సభ్యులు కృష్ణ, వేణుగోపాల్, తిరుపతి, రేఖ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వీవోఏ, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





# భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## - అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు-భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్







**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2(నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలో భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పెండింగ్ దరఖాస్తులపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి భూ సమస్యలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రతి సమస్యను ప్రాధాన్యంగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను బీఎల్‌ఓల వారీగా మండలాల వారీగా విభజించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ప్రతి బీఎల్‌ఓకు లక్ష్యాలను నిర్దేశించి సమయానికి పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జనగణనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి తహసీల్దారుల ఐడీ క్రియేషన్‌ను వేగవంతం చేయాలని జనగణన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు.

**అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించాలి..**

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఇసుక రీచ్‌ల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రీచ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని ఇప్పటి వరకు నమోదు చేసిన కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ పురోగతి, పెండింగ్ కోర్టు కేసులపై కూడా సమగ్ర సమాచారం కోరారు. వచ్చే వారంలో జిల్లాలోని అందరు తహసీల్దారులతో భూభారతి, ప్రజావాణి దరఖాస్తులు, ఎస్ఐఆర్ మ్యాపింగ్, జనగణన, భూసేకరణ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఇందుకు అవసరమైన పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఈ సెక్షన్ సూపర్డెంట్ స్వర్ణలత, ఏడి మైన్స్ దినేష్, భూసేకరణ అధికారి యాసిన్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ ఇంటి పైన వార్డు సభను నిర్వహించడం చట్ట విరుద్ధం..

## యూత్ కాంగ్రెస్ జమ్మికుంట అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్..

**జమ్మికుంట, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 2..**



మున్సిపల్ చట్టం ప్రకారం వార్డు సభ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాల లేదా వార్డు సమీక్షా కేంద్రం వంటి బహిరంగ ప్రదేశాలలో, గ్రామస్తులందరికీ అందు బాటులో ఉండేలా జరగాలి. అలాంటిది జమ్మికుంట మున్సిపాలిటీ లోని 9వ వార్డు కౌన్సిలర్ పొనగంటి రాము ఇంటి పైన వ్యక్తిగత స్థలంలో సమావేశం నిర్వహించడం వల్ల పారదర్శకత లోపిస్తుందనీ ప్రజలందరూ పాల్గొనే అధికారిక సమావేశాలు కాబట్టి, ఎవరైనా స్వేచ్ఛగా వచ్చి వార్డు సభలో ప్రజలు వారి సమస్యలను విన్నవించుకోవడానికి వీలుగా ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ వ్యక్తిగత ఇంటి ప్రాంగణాల్లో నిర్వహించడం వల్ల ఇతరులకు ఇబ్బంది కలగవచ్చు. లేదా ప్రజలందరూ రావడానికి సంకోచించవచ్చని యూత్ కాంగ్రెస్ జమ్మికుంట అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, తెలిపారు.వార్డుసభ ప్రజలకు అందుబాటులో, రాజకీయేతర, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, లేదా ఇతర ప్రభుత్వ భవనాల్లోనే నిర్వహించాలని . స్థానిక ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా వీటిని బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలనీ, వార్డు సభ అనేది అభివృద్ధి సంకల్పానికి మొదటి అడుగు. అలాంటి వార్డు సభను ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించడం చట్ట విరుద్ధమని కౌన్సిలర్ పై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకొని, తిరిగి వార్డు సభను నిర్వహించాలని ప్రజలకు చట్టబద్ధత కల్పించాలని బుడిగె శ్రీకాంత్, అన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కార వేదికగా గ్రామసభలు నడవాలి

## -16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రజా సమస్యలు పరిష్కార వేదికగా గ్రామ సభలు నడవాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అన్నారు. 16వ డివిజన్ లో గురువారం డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొత్త పథకాలను మంజూరు చేసి గ్రామసభలు పెట్టుంటే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండేదని ఆమె అభి ప్రాయాన్ని వ్యక్తం చేశారు. సబ్ జైల్ ప్రాంగణంలో గతంలో మంజూరైన కమ్యూనిటీ హాల్ నిర్మాణం సింగరేణి సంస్థ వారు స్థలం విషయంలో పర్మిషన్ జాప్యం వల్ల నిర్మాణం జాప్యం అవుతుందని అట్టి నిర్మాణాన్ని శాసనసభ్యులు కూనంనేని సహకారంతో త్వరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మహిళలు మంచినీటి కోసం కష్టపడొద్దని ఎమ్మెల్యే కూనం నేని 125 కోట్ల రూపాయలతో మిషన్ భగీరథ పథకాన్ని సాధించారని పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని తెలిపారు. రెండు నెలలలో ఈ ప్రాంత ప్రజలకు ఇంటింటికి మంచినీళ్లు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి ఇతర పథకాల విషయంలో మా వంతు సహకారం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలో భాగంగా ఆర్టిసి ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, తెల్ల రేషన్ కార్డులు, సన్న బియ్యం పథకాలు నడుస్తున్నప్పటికీ, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, ఉచిత కరెంటు కూడా చాలా మందికి అందటం లేదని అన్నారు. అలాగే వితంతు వృద్ధాప్య వికలాంగుల ఒంటరి మహిళల పెన్షన్లు డివిజన్ వ్యాప్తంగా 72 మంది పెన్షన్లు ఎంక్వయిరీ చేసి అర్హుల జాబితాను అధికారులు సిద్ధం చేసినప్పటికీ గత 8 సంవత్సరాల నుండి ఒక్క పెన్షన్ కూడా మంజూరు కాలేదని ఈ ప్రజా పాలన సందర్భంగా నైనా ప్రభుత్వం కొత్త పెన్షన్లను తక్షణమే మంజూరు చేసి వారిని ఆదుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వార్డు స్పెషలాఫీసర్ కి తెలియజేశారు. అదేవిధంగా గతం ప్రజా పాలనలో అర్హుల జాబితాలో లేని ఇందిరమ్మ, ఇంటి స్థలాల లబ్ధిదారులు పెన్షన్ దారులు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. అర్హులైన ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను పరిశీలించి శాసనసభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పథకాలు మంజూరయ్యేట్లుగా చూడాల్సిందిగా వార్డ్ స్పెషలాఫీసర్ కి విజ్ఞప్తి చేశారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద ఇంటింటి మహిళకి 2500 రూపాయలు వేస్తామన్న పథకాన్ని అమలుపరిచి రాష్ట్ర మహిళ ఆశీస్సులను పొందాలని ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ గ్రామసభలో వార్డ్ స్పెషల్ ఆఫీసర్ శ్రావణి, వార్డ్ ఆఫీసర్ శివరాం, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, ఆర్పీలు జానకి, కవిత, అంగన్వాడీ టీచర్స్ సరోజ, నీలవేణి, షహనాజ్, ఆయాలు వెంకటలక్ష్మి, డివిజన్ పెద్దలు ముద్దం మార్తమ్మ, మంగమ్మ, నూనె శాంత, సిపిఐ నాయకులు అస్లాం వివిధ పార్టీల నాయకులు చనగరపు నరేష్, జుతుక దిలీప్, ఎల్.వంశీ, ఎస్.వంశీ, మహేష్, గుంజ వెంకన్న, ఉప్పుతల శీను తదితరులు పాల్గొన్నారు.



# మాతృభాషా ప్రేమికునికి మరో పురస్కారం

## - ఆచార్య రామకృష్ణ కు నేపాల్ వారి మాతృ భాషా రత్న పురస్కారం

**కరీంనగర్ ఏప్రిల్ 02(నేషనలిస్ట్ వాయిస్)**

స్థానిక ప్రముఖ సాహితీ వేత్త, ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కలువకుంట రామకృష్ణ కు శబ్ద ప్రతిభా బహు క్షేత్రీయ ఫౌండేషన్, నేపాల్ వారు మాతృ భాషా రత్న అవార్డు ను ప్రదానం చేశారు. కవిగా, రచయితగా ,వక్తగా , పరిశోధకునిగా బహుముఖీన మైన ప్రజ్ఞ కనబరుస్తూ మాతృ భాషా వికాసానికి ఆయన చేస్తున్న సేవలను, కృషిని గుర్తించి ఈ అవార్డు ను ప్రకటించినట్లు శబ్ద ప్రతిభా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆనంద్ గిరి మాయుల్, కార్యదర్శి మంజు ఖారే ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఉమేష్ కుమార్ ఆచార్య కలువకుంట రామకృష్ణ కు ఈ అవార్డును ప్రదానం చేశారు.ఆచార్య రామకృష్ణ గతంలో భారత్ భాషా భూషణ్, ఇందిరా గాంధీ ఎన్ ఎస్ ఎస్ జాతీయ అవార్డు, అలిశెట్టి స్మారక పురస్కారం, తెలుగు తేజం పురస్కారం తదితర అనేక పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా సాహితీ వేత్తలు డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ గంద్ర లక్ష్మణ్ రావు, అన్నవరం దేవేందర్, కొత్త అనిల్ కుమార్, గాజుల రవీందర్, గాజోజు, కె ఎస్ అనంతా చార్య, నంది శ్రీనివాస్ వీరికి అవార్డు రావడం వర్తమాన కవులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు విభాగం అధ్యక్షుడు బూర్ల చంద్ర శేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ప్రకాష్, టి జి సి జి టి ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సత్య ప్రకాశ్, వైస్ ప్రిన్సిపల్స్ నితిన్, రాజయ్య , హర్జోత్ కౌర్ వీరికి ఈ అవార్డు రావడం పట్ల హర్షం వెలిబుచ్చుతూ , అభినందనలు తెలియజేశారు.

# ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమణ దాడిని నిలిపివేయాలి

## -8న కొత్తగూడెంలో శాంతి ర్యాలీ -రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్షం నాయకులు





**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2(నేషనలిస్ట్ వాయిస్):**

ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు దురాక్రమణ పూరిత క్షిపణి దాడికి దిగగా అది నేడు పశ్చిమాషియాలో మినీ యుద్ధంగా మారిపోయిందని తక్షణమే దురాక్రమణ దాడిని నిలిపివేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడెం రైటర్ బస్తి ఐ ఎఫ్ టి యు కార్యాలయంలో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షులు నయీం ఖురేషి, కాంగ్రెస్ టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలసౌరి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు దేవదానం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు బుర్ర వీరభద్రం, బి ఎస్ పి పార్లమెంటరీ ఇంచార్జి తాండ్ర వెంకటేశ్వర్లు, బీఎస్పీ జిల్లా నాయకులు కురుమల శంకర్, తెలుగుదేశం జిల్లా నాయకులు కోటయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్యలు ప్రసంగిస్తూ ఇరాన్ పై బాంబుల దాడినిఅమెరికా ఇజ్రాయిల్ కొనసాగించడం సహించరానిదని మండిపడ్డారు. దాడి వల్ల ప్రపంచ దేశాలకు ఆయిల్ సరఫరా సరిగా లేకపోవడంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఐక్యరాజ్యసమితి తీర్మానం లేకుండా స్వతంత్ర సార్వభౌమత్వం కలిగినటువంటి దేశాలపై అమెరికా తన ఆధిపత్యం కోసం దాడులు నిర్వహిస్తుందని వారు అన్నారు. ఈ దాడుల వలన రేపు ప్రపంచంలో విపరీతమైన ధరలు పెరిగిపోయి ప్రజలు జీవించలేరని ఇలాంటివి దాడులు ప్రజలు ప్రజాస్వామ్యవాదులు మేధావులు ఖండించాలని పిలుపునిచ్చారు.

ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న దాడిని వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 8న కొత్తగూడెంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తుందని దీనికి ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యాసంస్థలు, యువకులు, వివిధ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సంజీవ్, కోశాధికారి మల్లికార్జునరావు, పిడిఎస్ యు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డమరుకేష్, రోహిత్, వినయ్, జీవన్, సురేందర్ ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లు చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

## -పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కాపాటి పృథ్వి

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2(నేషనలిస్ట్ వాయిస్):**

ముందస్తు అడ్మిషన్లు చేసే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కాపాటి పృథ్వి డిమాండ్ చేశారు. కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్ యూ)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలియజేశారు. పోస్ట్ ఆఫీస్, బస్టాండ్ సెంటర్లో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన హోర్డింగులపై ఫ్లెక్సీలు చింపి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం అని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, సీట్ రిజర్వేషన్ పేరుతో తల్లిదండ్రుల నుంచి అక్రమంగా రిజర్వేషన్ ఫీజులు వసూలు చేస్తున్నారని అడ్మిషన్ ఫీజులు డొనేషన్ల పేరుతో పేద విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్నారని అన్నారు. ప్రైమరీ విద్యకే 20,000 నుండి 8 లక్షల వరకు ఫీజులు వసూళ్లు చేస్తున్నారని తెలంగాణలో 11 వేల ప్రైవేట్ పాఠశాలలు ప్రతి ఏటా 20--25 శాతం ఫీజు పెంచుతున్నారనీ, ప్రైవేట్ పాఠశాలల పిల్లలపై ప్రభుత్వ పాఠశాల కంటే 9 రెట్లు అధిక కుటుంబ వ్యయం వెచ్చించాల్సి వస్తుందని అన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురుస్తుందని తిరిగి ఫీజులు చెల్లించలేక ప్రైవేట్ యాజమాన్యాల వేధింపులతో ఒత్తిడులకులోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు.




### జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు అదనపు ఫీజు వసూళ్ళు జరిపిన సంస్థలపై ఎఫ్ఐఆర్

నమోదు చేసి తిరిగి ఫీజులు వసూళ్లు చేయాలన్నారు. పది, ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడే వరకు ఏ ప్రైవేట్ సంస్థ అడ్మిషన్లు ఫీజు వసూళ్ళు జరపకూడదని ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం, జిల్లా కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను చేర్చే బాధ్యతని విస్మరించొద్దు

### సమిష్టి కృషితోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యం

### వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

### అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలి

### శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2(నేషనలిస్ట్ వాయిస్):**

99 రోజుల ప్రగతి ప్రణాళికతో ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని దీనికి అధికారులు పాలకవర్గాలు సహకారం అందించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ భూక్యా శాంతి అధ్యక్షతన జరిగిన '99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరం కలిసి గ్రామాన్ని సమిష్టిగా అభివృద్ధి చేసుకుందామని ఇప్పటికే పంచాయతీలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను దాదాపుగా పూర్తి చేశామని తెలిపారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి తన వంతుగా పూర్తి స్థాయి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటా యని పేర్కొన్నారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాలని పారదర్శక మైన పాలనతోనే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సభలో ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, మండల స్పెషల్ ఆఫీసర్ డిఐఈఓ వెంకటేశ్వరరావు, ఇన్చార్జి తాసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిని, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, పంచాయతీ గుమస్తా రామకృష్ణ, బిల్ కలెక్టర్లు అమర్ నాథ్, సురేష్, కిషోర్, బోస్, పిచ్చయ్య, శానిటేషన్ సూపర్వైజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.




# రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## -రైతాంగాన్ని రక్షించడానికి వ్యవసాయాన్ని కాపాడటానికి ఉద్యమాలు

## -విలేకర్ల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2(నేషనలిస్ట్ వాయిస్):**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాల వలన దేశంలో రాష్ట్రంలో రైతాంగాన్ని కాపాడటానికి వ్యవసాయాన్ని రక్షించడానికి ఉద్యమాలను రూపకల్పన చేయటానికి కొత్తగూడెం కేంద్రంలో ఈనెల 23 24 25 తేదీలలో జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మంచిగంటి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో పోతినేని సుదర్శన్ రావు పాల్గొని మాట్లాడుతూ దేశంలో 50 శాతం మందికి పైగా వ్యవసాయం పైన ఆధారపడుతున్నారని అటువంటి ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో తీవ్ర అన్యాయం చేసిందని ఆయన అన్నారు. ఇటీవల బడ్జెట్ లో 53 లక్షల కోట్లతో ప్రవేశపెడితే 50 శాతం మందిగా ఉన్న వ్యవసాయానికి కేవలం లక్ష అరవై వేల కోట్లు కేటాయించడం వ్యవసాయాన్ని దెబ్బ తీయడం తప్ప మరొకటి కాదని అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ చేయటం కోసం విద్యుత్ సవర్ణ చట్టం ఎరువులపై సబ్సిడీని ఎత్తివేయడం యూరియాని రైతులుకి అందుబాటులో లేకుండా చేయడం రైతులు బీమా సౌకర్యం లేకుండా చేయటం వంటివి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని దానివల్ల రైతాంగం దివాలా తీసే పరిస్థితి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకి అర్థం కాని అందుబాటులో లేని యాప్ల తీసుకొచ్చి వాటి ద్వారా ఎరువుల కొనుగోలు అమ్మకాలు జరిగేటట్లు తీసుకురావడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయ నామాకరణ పేరుతో మా ప్రభుత్వం పని చేస్తుందని చెప్తున్నప్పటికీ బడ్జెట్లో కేటాయింపులు మాత్రం అరకొరగా కేటాయింపులు జరపటం రైతులను మోసం చేయడం తప్ప మరొకటి కాదని ఆయన చెప్పారు. సంవత్సరానికి రెండు విడతల్లో రైతు భరోసా ఆరు దఫాలుగా ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం రెండు దఫాలు ఇచ్చి చేతులు దొరుకుతుందని రైతు రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం 50 శాతం మాత్రమే అమలు చేసి పూర్తిగా అమలు చేసిన అని చెప్పేసి తప్పుడు ప్రచారం చేయడం రైతాంగాన్ని దెబ్బతీయటం తప్ప ఇంకోటి కాదని ఆయన పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తారంగా సాగవుతున్న పామాయిల్ పంటకి తగ్గట్టుగా పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలని అందుకు అశ్వరావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ 30 టన్నుల నుంచి 60 టన్నుల సామర్థ్యానికి పెంచాలని సూచించారు. అశ్వరావుపేట ఫ్యాక్టరీ 60 టన్నుల నుంచి ఆధునిక టెక్నాలజీతో ఆధునికరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ శుద్ధి చేసిన ముడి ఆయిల్ని సిద్దిపేటకు తీసుకుపోకుండా ఇక్కడే రిఫైనరీ సెంటర్ ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టా హక్కులేని సాగుదారులకి రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రధానంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు దేశవ్యాప్తంగా వ్యవసాయానికి ఎదురవుతున్న సవాళ్లపైన మూడవ రాష్ట్ర మహాసభల్లో కూలంకషంగా చర్చించి రైతాంగ ఉద్యమాల్ని బలోపేతం చేయడానికి కార్యచరణ రూపొందించడానికి అందుకు కావలసిన తీర్మానాలు రూపకల్పనకు ఈ మహాసభలను వేదిక ఏర్పాటు చేసుకుంటున్నామని ఆయన తెలిపారు. అటువంటి ముఖ్యమైన మహాసభల జయప్రదానికి జిల్లాలో ఉన్న రైతాంగం సహకరించి జయప్రదం చేయాలని ఆయన రైతు సోదరులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు జలసూత్రం శివరాం ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎలమంచి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు కున్సోత్ ధర్మ, కొండ బోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకూడదు

### అధికారులకు సూచించిన నాలుగో వార్డ్ కౌన్సిలర్ జైపాల్ నాయక్

**తూప్రాన్, ఏప్రిల్ 2 (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి):**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో ప్రజాప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ వేదాంత్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా టీపీఓ పావని, మేనేజర్ శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ జైపాల్ నాయక్ మాట్లాడుతూ, వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రజల సహకారం కూడా అవసరమని తెలిపారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శానిటేషన్ 100 శాతం ఉండేలా చూడాలని సూచించారు.




ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల అంశాలపై అధికారులకు సూచనలు చేస్తూ, కొత్త పింఛన్ల కోసం అర్హులు అప్లికేషన్లు చేసుకోవాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసినవారిలో కొందరికి మంజూరు కాగా, మరికొందరి దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరుతున్న సమస్యపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల వేసిన రోడ్లకు రెండు నెలలు గడిచినా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంపై అధికారులను నిలదీశారు. అలాగే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త బోర్లు త్రవ్వాలని, చెడిపోయిన వీధి దీపాలను మరమ్మతు చేయడంతో పాటు కొత్త లైట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. టీపీఓ పావని మాట్లాడుతూ, వార్డులో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు తమ కౌన్సిలర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇంటి పన్ను 100 శాతం చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య తూప్రాన్--1 స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**తూప్రాన్, ఏప్రిల్ 2. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ పట్టణంలోని శ్రీ చైతన్య తూప్రాన్--1 పాఠశాలలో చిన్నారి విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పి.పీ--2 మరియు ఐదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ గౌన్లు, క్యాప్స్ ధరించి వేదికపై అడుగుపెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలు సర్టిఫికెట్లు అందుకోవడం భావోద్వేగ క్షణాలను సృష్టించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొంపల్లి జోన్--1 ఏజీఎం జి.వి. రమణ రావు, తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ సమతా కాశిరెడ్డిలు హాజరయ్యారు. అలాగే జోనల్ కోఆర్డినేటర్ రవి, అసోసియేట్ కోఆర్డినేటర్ సోమేశ్, ప్రైమరీ జోనల్ కోఆర్డినేటర్ లావణ్య, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్లు కావ్యరెడ్డి, అన్నపూర్ణ లు పాల్గొన్నారు. అతిథులు చిన్నారులకు ప్రశంసాపత్రాలు, ముమెంటోలు అందజేసి అభినందించారు. పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి శ్రీ చైతన్య సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. అకాడమిక్ డీన్ అశోక్ రెడ్డి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐకాన్ ఇన్చార్జ్ రాజేష్ రెడ్డి, సి బ్యాచ్ ఇన్చార్జ్ రమేష్, ప్రైమరీ ఇన్చార్జ్ కళావతి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ ఉష, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం వేడుక ఆనందోత్సాహాల మధ్య, చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేసే మధుర క్షణాలుగా నిలిచింది.






# పత్తి మార్కెట్ కు వరుసగా మూడు రోజులు సెలవులు.

### మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం.

**జమ్మికుంట, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 2..**

వ్యవసాయ మార్కెట్ కమిటి, జమ్మికుంట పత్తి మార్కెట్ కు వరుసగా (03) రోజుల పాటు సెలవులు. ప్రకటించిన మార్కెట్ చైర్ పర్సన్ శ్రీమతి పుల్లూరి స్వప్న - సదానందంతేది: 03.04.2026 శుక్రవారము రోజున " గుడ్ ఫ్రైడే,తేది: 04.04.2026 శనివారము రోజున వారాంతపు మార్కెట్ యార్డు కు సెలవు,తేది: 05.04.2026 ఆదివారము రోజున సాధారణ సెలవు, కావున ఇట్టి సందర్భములను పురస్కరించుకొని శు క్రవారములి నుండి ఆదివారము వరకు వరుసగా ( 03) మూడు రోజుల పాటు మార్కెట్ యార్డు బందు ఉంటుందని తిరిగి తేది. 06.04.2026. సోమవారము రోజున మార్కెట్‌లి పున:ప్రారంభమగునని కావున పై విషయమును రైతు సోదరులు గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను పైన తెలిపిన సెలవు రోజులలో తమ సరుకులను మార్కెట్ యార్డు నకు తరలించవద్దని వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ శ్రీమతి పుల్లూరి స్వప్న-సధానందం, ఒక ప్రకటనలో తెలిపారు..



# వైభవ్ సూర్యవంశీ భారీ రికార్డ్..



రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ, బలమైన చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. కేవలం 17 బంతుల్లో 52 పరుగులు చేసిన ఈ యువ కెరటం, అందులో కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసి ఐపీఎల్ రికార్డులను సమం చేశాడు. మైదానం నలుమూలలా అతను బాదిన షాట్లు చూస్తుంటే, ఒక అనుభవజ్ఞుడైన అంతర్జాతీయ ఆటగాడు ఆడుతున్నట్లు అనిపించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైభవ్ అద్భుత ప్రదర్శన చూసిన పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్, అతడిని వెంటనే భారత టీ20 జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. ఇంత చిన్న వయస్సులో ఇంతటి పరిణతితో ఆడటం అసాధారణమని, ఐపీఎల్ ముగియగానే అతను టీమ్ ఇండియా నీలి రంగు జెర్సీలో కనిపిస్తాడని అక్మల్ జోస్యం చెప్పారు. సరిహద్దుల అవతల నుంచి కూడా వైభవ్ ప్రతిభకు ప్రశంసలు దక్కడం అతని సత్తాకు నిదర్శనం. వైభవ్ సూర్యవంశీలో ఉన్న అతిపెద్ద బలం అతని భయం లేని బ్యాటింగ్ శైలి. లక్ష్యం చిన్నదైనా, పెద్దదైనా ఏమాత్రం తడబడకుండా బౌలర్లపై విరుచుకుపడటమే ఇతని శైలి. యశస్వి జైస్వాల్‌తో కలిసి అతను అందించిన ఓపెనింగ్ భాగస్వామ్యం రాజస్థాన్ జట్టుకు సునాయాస విజయాన్ని అందించింది. కేవలం పరుగులు చేయడమే కాకుండా, మ్యాచ్ పరిస్థితులను బట్టి తన ఆటను మార్చుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ వైభవ్ ఆటతీరును సరదాగా ప్రశంసించారు. "ఈ ఒక్క బబ్లూ అందరికంటే భారంగా మారాడు" అంటూ వైభవ్ దూకుడును కొనియాడాడు. అనుభవజ్ఞులైన బౌలర్ల బంతులకు కూడా తన దగ్గర సమాధానం ఉందని వైభవ్ నిరూపించాడు. అతని షాట్ ఎంపిక, మైదానంలో చూపే తెగువ భారత క్రికెట్ భవిష్యత్తుకు శుభసూచకమని నిపుణులు అంటున్నారు. ఏదేమైనా, 15 ఏళ్లకే భారత జట్టులో చోటు సంపాదిస్తే, అది క్రికెట్ చరిత్రలోనే ఒక అద్భుత ఘట్టంగా నిలిచిపోతుంది.



# లక్నో స్టేడియంలో ఫ్యాన్స్ వీరంగం..

ఐపీఎల్ 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగుతున్న మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానుల మధ్య చిన్నపాటి వాగ్వాదం చివరకు పెద్ద గొడవకు దారితీసింది. స్టేడియం లోపలే అభిమానులు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించాయి. ఘర్షణకు గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. గొడవ ముదరడంతో వెంటనే స్పందించిన పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను విడదీశారు. మ్యాచ్ విషయానికి వస్తే, మొదట బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ తమ అద్భుత బ్యాటింగ్‌తో విజయతీరాలకు చేర్చారు. ఇంకా రెండు ఓవర్ల సమయం మిగిలి ఉండగానే ఢిల్లీ జట్టు విజయాన్ని అందుకుంది.

# వికెట్ టేకింగ్ ఆప్షన్ కోసం శివాంగ్ కుమార్ తుది జట్టులోకి సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ వెల్లడి

టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ తెలిపాడు. తుది జట్టులో ఒక మార్పు చేశామని చెప్పిన ఇషాన్ కిషన్.. వికెట్ టేకింగ్ ఆప్షన్ కోసం శివాంగ్ కుమార్‌ను తుది జట్టులోకి తీసుకున్నామని పేర్కొన్నాడు. దాంతో హర్షల్ పటేల్ ఉద్వాసనకు గురయ్యాడని తెలిపాడు. 'టాస్ గెలిస్తే మేం కూడా బౌలింగ్ ఎంచుకునేవాళ్లం. ముందుగా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు.. బంతిని గమనించి దానికి అనుగుణంగా ఆడాల్సి ఉంటుంది. ఈ మ్యాచ్‌లో మేం మా అత్యుత్తమ ఆటను ప్రదర్శించాలి. బేసిక్స్‌కు తగ్గట్లు ఆడుతూ మా ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలి. పరిస్థితులు ప్రతికూలంగా మారినా ప్రశాంతంగా ఉండాలి. ఈ మ్యాచ్‌లో మేం ఆటను సింపుల్‌గా ఉంచాలని అనుకుంటున్నాం. ప్యాట్ కమిన్స్ రీఎంట్రీ ఎప్పుడా అనేది నాకు తెలియదు. కానీ అతను త్వరలోనే అందుబాటులోకి వస్తాడు. అతను జట్టులోకి వస్తే బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ బలం కూడా పెరుగుతుంది. మా తుది జట్టులో ఒక మార్పు చేశాం. వికెట్ టేకింగ్ ఆప్షన్ కోసంశివాంగ్ కుమార్‌ను తుది జట్టులోకి తీసుకున్నాం. అతను నెట్స్‌లో బాగా బౌలింగ్ చేశాడు.'అని ఇషాన్ కిషన్ చెప్పుకొచ్చాడు. శివాంగ్ కుమార్ కోసం ఎషాన్ మలింగా, హర్షల్ పటేల్‌లను ఇంపాక్ట్ సబ్ లిస్ట్‌లో చేర్చారు. మరోవైపు ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ తో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే తెలిపాడు. గాలీ వీస్తుండటంతో మంచు ప్రభావం ఏ మేరకు ఉంటుందో చెప్పలేమన్నాడు. వర్షం పడే అవకాశాలు ఉండటంతోనే ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నామని చెప్పాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయబోతున్నాం. ఆటను మెరుగుపరుచుకోవడానికి ఎప్పుడూ అవకాశం ఉంటుంది. గత మ్యాచ్‌లో ఓడినా.. చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. సాధారణంగా ఈడెన్ గార్డెన్స్‌లో ఇంత గడ్డిని చూడం. పైగా వర్షం పడే సూచనలు కూడా ఉన్నాయి. అందుకే మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం.గాలి వీస్తున్నందున మంచు ప్రభావం ఎంతవరకు ఉంటుందో తెలియదు. ఈ పిచ్ 40 ఓవర్ల పాటు బాగానే సహకరిస్తుంది. కామెరూన్ గ్రీన్ చేయాల్సిందంతా చేస్తున్నాడు. త్వరలోనే బౌలింగ్ చేస్తాడు. మేం తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగుతున్నాం.'అని అజింక్యా రహానే చెప్పుకొచ్చాడు.

**సన్‌రైజర్స్ హైదరాబాద్:**

అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్/కెప్టెన్), హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, సలిల్ అరోరా, హర్ష్ దూబే, శివాంగ్ కుమార్, జయదేవ్ ఉనద్కత్, డేవిడ్ పేన్.

**కోల్‌కతా నైట్ రైడర్స్:**

అజింక్య రహానే (కెప్టెన్), కామెరాన్ గ్రీన్, అంగ్‌క్రిష్ రఘువంశీ (వికెట్ కీపర్), రింకూ సింగ్, రమణ్‌దీప్ సింగ్, అనుకుల్ రాయ్, సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, బ్లెస్సింగ్ ముజరబానీ.






# శ్రీలంక క్రికెట్ బోర్డుపై కోర్టులో నువాన్ తుషారా కేసు

ఐపీఎల్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) జట్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్సీబీ స్టార్ పేసర్, శ్రీలంకకు చెందిన నువాన్ తుషారా తన దేశ క్రికెట్ బోర్డుపై కోర్టులో కేసు వేశారు. ఐపీఎల్ ఆడేందుకు తనకు నో ఆబ్జెక్షన్ సరిఫికేట్(ఎన్వోసీ) నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ నువాన్ తుషారా ఈ నిర్ణయం తీసుకున్నాడు.నువాన్ తుషారా ఐపీఎల్ 2026లో పాల్గొనేందుకు శ్రీలంక క్రికెట్ బోర్డును అనుమతి కోరగా.. బోర్డు నిర్దేశించిన ఫిట్‌నెస్ ప్రమాణాలను ఆయన అందుకోలేదనే కారణంతో ఎన్వోసీని నిరాకరించింది. అయితే తన కెరీర్ అంతటా తన ఫిట్‌నెస్ స్థాయిలు ఇలాగే ఉన్నాయని.. గతంలో ఇదే ఫిట్‌నెస్‌తో ఆడినప్పుడు నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇచ్చిన బోర్డు.. ఇప్పుడు నిరాకరించడం అన్యాయమని నువాన్ తుషారా వాదిస్తున్నాడు. బోర్డు నిర్ణయం వల్ల తాను ఆర్థికంగా, కెరీర్ పరంగా ఎంతో నష్టపోతున్నానని తుషారా ఆవేదన వ్యక్తం చేశాడు.శ్రీలంక క్రికెట్ బోర్డుతో తనకున్న సెంట్రల్ కాంట్రాక్టు మార్చి 31తో ముగిసిందని.. దానిని పునరుద్ధరించుకోవడానికి తనకు ఇష్టం లేదని నువాన్ తుషారా స్పష్టం చేశాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుని ఫ్రీలాన్స్ క్రికెటర్‌గా కొనసాగాలని నువాన్ తుషారా భావిస్తున్నాడు. ఈ మేరకు శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్షుడు శమ్మీ సిల్వా, కార్యదర్శి బందుల దిస్సానాయకే సహా ఇతర ఉన్నతాధికారులను ప్రతివాదులుగా చేరుస్తూ కొలంబో జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ కేసు విచారణను కోర్టు ఏప్రిల్ 9కి వాయిదా వేసింది.2025 ఐపీఎల్ వేలంలో నువాన్ తుషారాను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 1.6 కోట్లకు కొనుగోలు చేసింది. గత సీజన్‌లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలిచినప్పుడు నువాన్ తుషారా జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. మలింగ తరహా బౌలింగ్ యాక్షన్‌తో అలరించే నువాన్ తుషారాకు ఆర్సీబీ అభిమానుల్లో మంచి క్రేజ్ ఉంది. ఒకవేళ కోర్టు నుంచి తుషారాకు అనుకూలంగా తీర్పు రాకపోతే.. ఆయన ఈ సీజన్ మొత్తానికి దూరం కావాల్సి ఉంటుంది.ఓ పక్క నువాన్ తుషారా కోర్టు వివాదంలో చిక్కుకోగా.. మరోపక్క ఆర్సీబీ ఐపీఎల్ 2026 సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో బెంగళూరు విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీకి నువాన్ తుషారా వంటి కీలక బౌలర్ అందుబాటులో లేకపోవడం కొంత లోటే అని చెప్పాలి. కోర్టు తీర్పుపైనే ఇప్పుడు నువాన్ తుషారా ఐపీఎల్ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

..............

# అభిషేక్ శర్మ నంబర్ వన్

## ఇషాన్ కిషన్ నంబర్ టూ

## టాప్ పది స్థానల్లో నలుగురు భారతీయులు !

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల..



అంతర్జాతీయ క్రికెట్ మండలి టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టాప్ రెండు స్థానాలను భారత యువ సంచలనాలు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కైవసం చేసుకున్నారు. అభిషేక్ శర్మ ఏకంగా 875 రేటింగ్ పాయింట్లతో నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకోగా.. అగ్రస్థానానికి కేవలం నాలుగు పాయింట్ల దూరంలో ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ 871 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత క్రికెట్ చరిత్రలో ఇలా ఇద్దరు ఆటగాళ్లు టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో వరుసగా తొలి రెండు స్థానాలను ఆక్రమించడం ఇదే తొలిసారి. టాప్ 10 స్థానంలో మొత్తం నలుగురు భారతీయులు ఉండటం మరో విశేషం. యువ సంచలనం తిలక్ వర్మ ఆరో స్థానంలో నిలవగా.. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఏడో స్థానంలో కొనసాగుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తున్నారు. టాప్ 20 బ్యాటర్ల జాబితాలో ఇతర దేశాల ఆటగాళ్ల స్థానాల్లో స్వల్ప మార్పులు మాత్రమే చోటుచేసుకున్నాయి. ఇంగ్లండ్ వెటరన్ బ్యాటర్ జోస్ బట్లర్ ఒక స్థానం ఎగబాకి ఎనిమిదో ర్యాంకుకు చేరుకోగా, న్యూజిలాండ్‌కు చెందిన టిమ్ సీఫెర్ట్ ఒక స్థానం దిగజారి తొమ్మిదో ర్యాంకుతో సరిపెట్టుకున్నాడు. ఇటీవలే న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కించుకున్న దక్షిణాఫ్రికా ఆటగాడు కోనర్ ఎస్టర్‌హుజెన్ తన ర్యాంకును అమాంతం మెరుగుపరుచుకున్నాడు. గతంలో టాప్ 100 వెలుపల ఉన్న అతను ఏకంగా 39వ స్థానానికి దూసుకురావడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అదే సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన కివీస్ ఆటగాడు టిమ్ రాబిన్సన్ 32వ స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్ విభాగం విషయానికి వస్తే ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. భారత అగ్రశ్రేణి స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి రెండో స్థానంలో నిలవగా, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐదో ర్యాంకులో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా అగ్రస్థానంలో ఆధిపత్యం చెలాయిస్తుండగా.. భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విశేషంగా రాణించిన దక్షిణాఫ్రికా బౌలర్లు గెరాల్డ్ కోయెట్జీ, ఒట్నీల్ బార్ట్‌మాన్ లాంటి అద్భుత ఆటగాళ్లు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారీగా ఎగబాకారు. రానున్న ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు టీమిండియా ఆటగాళ్లు మూడు విభాగాల్లోనూ సత్తా చాటుతుండటం భారత క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నింపుతోంది.


# 515 మిలియన్ల వ్యూయర్‌షిప్‌తో కొత్త రికార్డు..!




ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ గ్రాండ్ గా మొదలైంది. పది టీమ్‌లతో జరుగుతున్న ఈ టోర్నమెంట్ మొదటి రెండు మ్యాచ్‌లే వ్యూయర్‌షిప్ పరంగా పాత రికార్డులన్నీ చెరిపేసాయి. బ్రాడ్‌కాస్టర్ జియోస్టార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కేవలం ఓపెనింగ్ వీకెండ్‌లోనే టీవీ, డిజిటల్ మాధ్యమాల్లో కలిపి ఏకంగా 51.5 కోట్ల మంది ఈ మ్యాచ్‌లను చూశారు. గత సీజన్ మొదటి రెండు మ్యాచ్‌లతో పోలిస్తే వాచ్-టైమ్ పరంగా 26 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం మీద 32.6 బిలియన్ నిమిషాల పాటు ఫ్యాన్స్ ఐపీఎల్ ఫీవర్‌లో మునిగిపోయారు. ఈసారి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ మీద వ్యూయర్‌షిప్ అదిరిపోయింది. కనెక్టెడ్ టీవీ రీచ్ సుమారు 30 శాతం పెరిగింది. కాంకరెన్సీ (ఒకే సమయంలో చూసేవారు) ఏకంగా 61 శాతం మేర జంప్ అవ్వడం విశేషం. అటు లీనియర్ టెలివిజన్ (సాధారణ టీవీ) రంగంలో కూడా 24 శాతం టీవీఆర్ గ్రోత్ కనిపించింది. ఈ స్టార్ట్ చాలా ఎనర్జీ ఇచ్చిందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్ పేర్కొన్నారు. క్వాలిటీ క్రికెట్ తో పాటు ఫ్యాన్స్‌కు అందిస్తున్న సరికొత్త ఎక్స్‌పీరియన్స్ వల్లే ఈ రిజల్ట్స్ వస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సీజన్ సక్సెస్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్నది హిందీ ఫీడ్. రవిచంద్రన్ అశ్విన్, సురేష్ రైనా, హర్భజన్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్, ఇర్ఫాన్ పఠాన్ వంటి మాజీ క్రికెట్ దిగ్గజాలు తమ విశ్లేషణలతో ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. ఇది సాధారణ వీక్షణను ఒక అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్‌గా మార్చేసింది. ఐపీఎల్ క్రేజ్ రోజురోజుకూ పెరుగుతోందని, ఆధునిక ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్లుగా లీగ్ రూపాంతరం చెందుతోందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపారు. గ్రౌండ్‌లో ప్లేయర్స్ చేసే రన్ చేజ్ లు, హై-స్కోరింగ్ గేమ్స్ బ్రాడ్‌కాస్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. జియోస్టార్ స్పోర్ట్స్ సీఈఓ ఇషాన్ ఛటర్జీ మాట్లాడుతూ.. టాటా ఐపీఎల్ 2026 రికార్డు స్థాయి ఎంగేజ్‌మెంట్ సాధించిందన్నారు. డిజిటల్ ఇంటరాక్టివిటీని పెద్ద స్క్రీన్ల పవర్‌తో కలిపి పర్సనలైజ్డ్ ఎక్స్‌పీరియన్స్‌ను ఫ్యాన్స్‌కు అందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల బ్రాండ్ పార్ట్నర్లకు కూడా మంచి వాల్యూ లభిస్తోందని ఆయన వివరించారు. టోర్నమెంట్ ముందుకెళ్లే కొద్దీ ఈ వ్యూయర్‌షిప్ నంబర్లు ఇంకా పెరుగుతాయని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. మొత్తానికి ఐపీఎల్ 2026 క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోవడం ఖాయంగా కనిపిస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# రామాయణ టీజర్ విడుదల

రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న సినిమా 'రామాయణ' ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ ఆకట్టుకుంటున్నారు. వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కు హైలైట్ గా నిలిచాయి. సుమారు రూ.4000కోట్లతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. మొదటి భాగం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ ఆదిపురుష్ అంతగా ఆకట్టుకోలేక పోయిన తరవాత వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి. సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. 'రామాయణ' ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై నటుడు రణ్‌బీర్ కపూర్ మీడియా మీట్‌లో మాట్లాడారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాల్లో నటించాలని తాను అనుకున్నానని.. తన కల నెరవేరిందన్నారు. 2000లో విజువల్ ఆర్ట్స్‌కు సంబంధించి విదేశాల్లో శిక్షణ తీసుకున్నా. ఓసారి నా మిత్రుడు.. నువ్వు ఏం కావాలనుకుంటున్నావు? అమెరికాలోనే స్థిరపడి వర్క్ చేయాలనుకుంటున్నావా? అని అడిగాడు. మా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సినిమాతో అమెరికా వస్తా అని బదులిచ్చా. ఈ సినిమాతో నా కల నెరవేరిందని రణ్‌బీర్ అన్నారు. ఇందులో నటించేందుకు మొదట తాను ఆసక్తి చూపించలేదన్నారు. తండ్రి అయ్యాక తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందన్నారు. భయాన్ని వదిలి ధైర్యంగా ఈ సినిమాలో నటించేందుకు ముందుకొచ్చానని తెలిపారు.దీపావళి కానుకగా 'రామాయణ' తొలి భాగం ప్రేక్షకుల ముందుకురానుంది.







# వారణాసిలో రాముడు ఎలా ఉంటాడో?

దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'వారణాసి' అనే భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. గ్లోబల్ అడ్వెంచర్‌గా వస్తున్న ఈ సినిమా హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా.. దాదాపు వెయ్యి కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను రామాయణాన్ని టచ్ చేస్తూ ఊహకందని విధంగా.. విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నాడు రాజమౌళి. దీంతో మహేష్ బాబు రాముడి లుక్ ఎలా ఉంటుందా? అని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే వారణాసి వీడియో గ్లింప్స్ అదిరిపోయింది. తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న 'రామాయణ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తర్వాత.. వారణాసి రాముడి లుక్ రివీల్ అయితే మాత్రం.. ఇలా ఉండదని అర్థమవుతోంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్ లుక్ బాగున్నప్పటికీ.. రాజమౌళి రాముడు ఎలా ఉంటాడా అన్న ఆసక్తి మాత్రం పెరుగతోంది. ఎందుకంటే.. శ్రీరాముడి సీన్ షూట్ తర్వాత.. ఇన్ని రోజుల కష్టానికి ఈ ఒక్క షాట్ చాలు.. అని అనిపించిందని స్వయంగా మహేష్ బాబునే ఓసారి చెప్పుకొచ్చాడు. కాబట్టి.. లుక్స్ పరంగానే కాదు, విజువల్ పరంగాను వారణాసి టాప్ నాచ్ అనేలా ఉంటుందని చెప్పడంలో సందేహం అక్కర్లేదు.

# డెకాయిట్ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి

## అడవి శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. షనీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రివెంజ్ డ్రామా, రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మేళవింపుగా రూపొందుతోంది. కథ, ట్రీట్‌మెంట్ పరంగా కొత్తదనం చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. ఈ చిత్రంలో శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తాజాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ అభిమానులతో సోషల్ మీడియా ద్వారా ముచ్చటిస్తూ కీలక ప్రకటన చేశాడు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'డెకాయిట్' ట్రైలర్‌ను ఏప్రిల్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించాడు. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతాయని మేకర్స్ ధీమాగా ఉన్నారు. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, బాలీవుడ్ దర్శకుడు-నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనుండటం విశేషం. వారి పాత్రలు కథకు బలాన్ని అందించనున్నాయని టాక్ వినిపిస్తోంది. సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందిస్తుండగా, టెక్నికల్‌గా కూడా సినిమా ఉన్నత స్థాయిలో ఉండబోతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. అడివి శేష్ తన కెరీర్‌లో ఎప్పుడూ కంటెంట్ ఆధారిత సినిమాలతోనే గుర్తింపు పొందాడు. ఇప్పుడు 'డెకాయిట్'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటాడా అన్న ఆసక్తి నెలకొంది. మొత్తానికి ట్రైలర్ రిలీజ్‌తో 'డెకాయిట్'పై ఉన్న హైప్ మరింత పెరగడం ఖాయం.

# మా ఇంట్లో ఆంజనేయుడిపై సూర్యకిరణాలు

## ప్రత్యేక వీడియో పంచుకున్న మెగాస్టార్ చిరంజీవి

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఆంజనేయస్వామికి పరమభక్తుడనే విషయం తెలిసిందే. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆయన ఒక ప్రత్యేక వీడియోను అభిమానులతో పంచుకున్నారు. తన ఇంటిలోని పూజా మందిరంలో చోటుచేసుకొన్న ఓ అపురూప దృశ్యాన్ని ఈ వీడియోలో చూపించారు. ప్రత్యక్ష దైవం ఆ సూర్య భగవానుడి కిరణాలు మా ఇలవేల్పు హనుమంతుడిని స్పృశిస్తున్న అద్భుతమైన సన్నివేశాన్ని మీతో పంచుకుంటున్నాను' అని ఆయన ఈ వీడియో షేర్ చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా మా పూజా మందిరంలో జరిగిన ఒక విశేషాన్ని మీతో పంచుకోవాలని ఈ వీడియో చేస్తున్నా. ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో సూర్యకిరణాలు సప్త వర్ణాలుగా మారి మా పూజా మందిరంలో ఉన్న హనుమంతుడిని స్పృశిస్తూ ప్రసరించడం చూస్తుంటే ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఇటీవల మనం అయోధ్యలో బాలరాముడి నుదిటిపై సూర్యకాంతి పడి మెరిసిన అద్భుతాన్ని చూశాం. అలాగే కోణార్క్, అరసవల్లి దేవాలయాల్లో కూడా సూర్య కిరణాలు భగవంతుడిని తాకే విశేషం అందరికీ తెలిసిందే. అలాంటి దైవానుభూతి మా ఇంట్లోనూ ఆంజనేయుడిని స్పృశించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా' అని చిరంజీవి తెలిపారు. అనంతరం అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు చెప్పారు.



# ఏడేళ్ల కల సాకారం కాబోతోంది


## రామాయణ దర్శకుడు నితీశ్ తివారీ



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, దర్శకుడు నితీశ్ తివారీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'రామాయణ' సినిమాకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. రాముడి పాత్రలో రణ్‌బీర్ లుక్ ఎలా ఉంటుందనేది ఈ వీడియోతో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దర్శకుడు నితీశ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్షణం కోసం తాను ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. రామాయణ' కోసం సుమారు ఏడు సంవత్సరాల నుంచి వర్క్ చేస్తున్నా. చిత్రీకరణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. కాకపోతే, గత ఏడేళ్లలో ప్రతిక్షణం నాకు గుర్తుకొచ్చింది ప్రేక్షకులు మాత్రమే. ప్రేక్షకుల రియాక్షన్ ఎలా ఉంటుందా? అని ఎదురుచూస్తూ సమయాన్ని గడిపా. ఈరోజు మీ అందరి రియాక్షన్ చూసిన తర్వాత నా ఎదురుచూపులకు తగిన ప్రతిఫలం దక్కిందని నితీశ్ తివారీ అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది వర్క్ చేస్తున్నారని టీమ్ ప్రకటించింది.

# రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్

విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ




అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.



# తెలుగులో తొలి ఎఐ చిత్రం... అంబ ద రివెంజ్

తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికే విధంగా.. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి ఫీచర్ ఫిల్మ్ 'అంబ' ద రివెంజ్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంకేతిక విప్లవాన్ని తెరపైకి తీసుకువస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మిస్తుండగా.. రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇక జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ లలితకళా ఫిలిమ్స్, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. పౌరాణిక ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు ఏఐ టూల్స్ వినియోగంతో విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.

# ఖుష్బూకి విజయ్ సోదరుడిలాంటివాడు.. అందుకే అతన్ని విమర్శించను : సుందర్

తమిళనాడు రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రముఖ దర్శకుడు, నటుడు సుందర్ సి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించారు. ఆయన మదురై సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సుందర్ సి తన రాజకీయ ప్రయాణంపై స్పందించారు. మూడు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్న తాను, ఇప్పుడు ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అయితే ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ రెండు పెద్ద పార్టీల మధ్యే ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తమ పోటీ తీవ్రంగా ఉండబోతోందని చెప్పారు.ఇక నటుడు విజయ్ స్థాపించిన పార్టీపై ప్రశ్నించగా సుందర్ సి ఆసక్తికరంగా స్పందించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ విజయ్ విషయంలో తాను అలాంటి వ్యాఖ్యలు చేయనని స్పష్టం చేశారు. విజయ్ మా కుటుంబ సభ్యుడిలాంటి వాడు. నా భార్య ఖుష్బూ ఆయన్ని తమ్ముడిగా భావిస్తుంది. ఆయన కూడా ఆమెను అక్కగా పిలుస్తాడు. మా మధ్య ఉన్న ఈ బంధం వల్ల ఆయనను గానీ, ఆయన పార్టీని గానీ నేను విమర్శించను అని తెలిపారు.మదురై అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించిన ఆయన, గెలిస్తే ప్రతి నెలా కొంతకాలం నియోజకవర్గంలోనే ఉండి ప్రజలతో మమేకమవుతానన్నారు. ఎన్నికల ఫలితాలే తన తదుపరి రాజకీయ అడుగులను నిర్ణయిస్తాయని చెప్పారు. మరోవైపు విజయ్ తన పార్టీతో ప్రజల్లోకి వెళ్లేందుకు భారీ సభలు నిర్వహిస్తున్నాడు. అయితే ర్యాలీలకు అనుమతుల సమస్యలు, కొన్ని ఘటనలు, కేసులు వంటి ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి.మొత్తానికి తమిళనాడు రాజకీయాల్లో సినీ ప్రముఖుల ఎంట్రీతో పోటీ మరింత ఉత్కంఠగా మారింది. రాబోయే ఎన్నికల్లో ఇది ఎంతవరకు ప్రభావం చూపుతుందో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656